సామాజిక విప్లవ శిఖరం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్





# PCW తెలుగు దినపత్రిక

PCW News Broadcasting PVT Ltd


నిర్లక్ష్యం వహించకుండా వాటికి పరిష్కార మార్గం చూపాలి





Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 107 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- మంగళవారం 14 ఏప్రిల్ 2026


## మహిళా రిజర్వేషన్లతో
# పునర్విభజన లింక్


**● ఇందులో బిజెపి రాజకీయ కుట్ర దాగి ఉంది ● పునర్విభజనను రాజకీయ పావుగా వాడుకుంటున్న మోడీ ● జనాభా లెక్కల అనంతరం మహిళా బిల్లు అని చెప్పారు ● ఆ మేరకే గతంలో బిల్లు పెట్టి..ఇప్పుడీ హడావిడి ఎందుకు? ● పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలపై అనుమానాలు ఉన్నాయి ● 2011 జనాభా లెక్కల ప్రకారం మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలి ● జనాభా లెక్కల తరవాత నియోజకవర్గాల పునర్విభజనపై చర్చించాలి ● దక్షిణాదిని దెబ్బతీసే కుట్రలో భాగంగానే ఉత్తరాది సీట్ల పెంపు ● 50శాతం సీట్ల పెంపు ఏ ప్రాతిపదకనో ఎందుకు చెప్పడం లేదు ● మీడియా సమావేశంలో సిఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం**




**హైదరాబాద్,ఏప్రిల్ 13 (పిసిడబ్ల్యు న్యూస్):** మహిళారిజర్వేషన్లు, పునర్విభజనను కలపడంతో రాజకీయ కుట్ర ఉందని సిఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. 2026 జనాభా లెక్కల ప్రకారం మహిళారిజర్వేషన్లబిల్లు తీసుకువస్తే కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ఇవ్వడంతో పాటు కట్టుబడి ఉంటామని ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. హిళలరాజకీయసాధికారితకు కాంగ్రెస్ మొదటి నుంచి కట్టుబడి ఉంది..నియోజకవర్గాల పునర్వభజనను ప్రధాని మోదీ రాజకీయ పావుగా ప్రమాదకరంగా వాడుకుంటున్నాడని ఆరోపించారు. డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ల అంశాలపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం కోసమే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. డీలిమిటేషన్ అనేది రాజకీయ పార్టీలకో, ప్రభుత్వానికో సంబంధించిన అంశం కాదని స్పష్టం చేసిన సీఎం రేవంత్, దీనిని మహిళా రిజర్వేషన్లతో కలిపి చూపించడం సరైంది కాదన్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం ఈ రెండు అంశాలను కలిపి వ్యూహాత్మకంగా ముందుకు సాగుతోందని విమర్శించారు. సోమవారం సాయంత్రం సచివాలయంలో ఆయన మత్రులు, ఎంపిలు, ఇతర నాయకులతో కలసి మీడియా సమావేశంలో మాట్లాడారు. మహిళా రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా దుష్ప్రచారం జరుగుతోందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. మహిళలకు ఓటుహక్కు, రాజకీయ రిజర్వేషన్లు కల్పించడంలో కాంగ్రెస్ పార్టీ కీలక పాత్ర పోషించిందని ఆయన గుర్తు చేశారు. కాంగ్రెస్ హయాంలోనే మహిళలు ముఖ్యమైన పదవులు చేపట్టిన విషయాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. మహిళా రిజర్వేషన్లు, డీలిమిటేషన్ రెండూ వేర్వేరు అంశాలని స్పష్టం చేసిన రేవంత్ రెడ్డి, వీటిని కలిపి బీజేపీ మిగతా2లో...

## బిఆర్ఎస్‌తో పొత్తు ఇక్కడికే
# పరిమితం

**● ఖానాపూర్ సభలో బిజెపి అధ్యక్షుడు రాంచంద్రరావు**



**నిర్మల్,ఏప్రిల్ 13 (పిసిడబ్ల్యు న్యూస్):** పొత్తులపై తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. సోమవారం ఖానాపూర్ మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి విజయం సాధించడాన్ని పురస్కరించుకుని నిర్మల్‌లో ఏర్పాటు చేసిన విజయోత్సవ సభలో ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్తులో బీజేపీ ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోదని స్పష్టం చేశారు. ఖానాపూర్‌లో బీఆర్ఎస్‌తో జరిగిన పొత్తు స్థానిక నాయకుల మధ్య మాత్రమే జరిగిందని.. పార్టీ స్థాయిలో కాదని వివరించారు. ఖానాపూర్ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులు, పోలీసుల బలంతో గుండాయిజం చేసినా ప్రజలు బీజేపీకి మద్దతు ఇచ్చి పట్టం కట్టారని మిగతా2లో...

## రాష్ట్రపతిని కలిసిన
# లోకేశ్ బృందం




**న్యూఢిల్లీ,ఏప్రిల్ 13 (పిసిడబ్ల్యు న్యూస్):** రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు ఎపి ప్రతినిధి బృందం కృతజ్ఞతలు తెలిపింది. అమరావతి బిల్లు అమల్లోకి రావడంతో మిగతా2లో...

## పశ్చిమాసియాలో
# మళ్లీ యుద్ధమేఘాలు

**● ఇరాన్‌పై దాడికి ట్రంప్, ఇజ్రాయిల్ సమాలోచనలు ● ఎప్పుడు ఏం జరుగుతుందో అన్న ఆందోళన**



**వాషింగ్టన్,ఏప్రిల్ 13 (పిసిడబ్ల్యు న్యూస్):** అమెరికా-ఇరాన్ మధ్య శాంతి చర్చలు విఫలమవడంతో పశ్చిమాసియా మళ్లీ నివురుగప్పిన నిప్పులా మారింది. ఏ క్షణాన ఏం జరుగుతుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది. మరోవైపు, ఇరాన్‌పై మళ్లీ దాడులు ప్రారంభించేందుకు అమెరికా, ఇజ్రాయెల్ సిద్ధమవుతున్నట్లు వార్తలు రావడం ఆందోళన కలిగిస్తోంది. హర్మూజ్ జలసంధిని దిగ్బంధిస్తామని అమెరికా సెంట్రల్ కమాండ్ ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే. దీంతో పాటు ఇరాన్‌పై పరిమిత స్థాయిలో సైనిక దాడులను పునరుద్ధరించేలా అగ్రరాజ్య మిగతా2లో...




# కూల్చివేతలు ఆపండి

**- హైడ్రాకు హైకోర్టు ఆదేశం**

**హైదరాబాద్,ఏప్రిల్ 13 (పిసిడబ్ల్యు న్యూస్):** అక్రమ నిర్మాణాలు, అనుమతి లేని నిర్మాణాల కూల్చివేతలకు అమలు చేసే విధివిధానాలు ఏమిటో చెప్పే వరకు కూల్చివేత చర్యలు ఆపాలని హైడ్రాను హైకోర్టు ఆదేశించింది. సోమవారం మధ్యంతర ఉత్తర్వులను జారీ చేసింది. మిగతా2లో...

# 48 గంటల్లో క్షమాపణ చెప్పాలి

**- లేదంటే సివిల్, క్రిమినల్ చర్యలు : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు మంత్రి సీతక్క లీగల్ నోటీసులు**





**హైదరాబాద్,ఏప్రిల్ 13 (పిసిడబ్ల్యు న్యూస్):** అంగన్వాడీలకు సంబంధించిన మొబైల్ ఫోన్ల కొనుగోళ్ల విషయంలో నిరాధార ఆరోపణలు చేస్తూ తన ప్రతిష్టను దెబ్బతీసేలా బీఆర్ఎస్ పార్టీ వ్యవహరిస్తోందని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు సంబంధించి 48 గంటల్లో తనకు క్షమాపణ చెప్పాలనీ, లేదంటే సివిల్, క్రిమినల్ చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. ఈ మేరకు మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు సీతక్క సోమవారం లీగల్ నోటీసులు పంపారు. మంత్రి తరపున అడ్వకేట్ నాగులూరి కృష్ణ కుమార్ రిజిస్టర్ పోస్ట్ ద్వారా కేసీఆర్‌కు నోటీసు పంపారు. అంగన్వాడీ మొబైల్ ఫోన్ల కొనుగోలు ప్రక్రియను తెలంగాణ టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్ (టీజీటీఎస్) నిర్వహించిందని నోటీసులో సీతక్క పేర్కొన్నారు. టెండర్ ఎవాల్యుషన్ కమిటీ నిర్ణయాల ప్రకారం కాంట్రాక్ట్ జరిగిందని గుర్తుచేశారు. ఇందులో తన ప్రమేయం ఏమీ లేదని మిగతా2లో...

## ఐటి ఉద్యోగుల భద్రతపై
# ప్రత్యేక దృష్టి

**- ఉద్యోగులపై మతపరమైన ఒత్తిళ్లు ఉండరాదు**

**- ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్న బండి సంజయ్**



**హైదరాబాద్,ఏప్రిల్ 13 (పిసిడబ్ల్యు న్యూస్):** నాసిక్‌లో జరిగిన 'లవ్ జిహాద్' ఆరోపణల కేసు నేపథ్యంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్రంగా స్పందించారు. హైదరాబాద్ ఐటీ రంగంలో పనిచేస్తున్న ఉద్యోగుల భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. ఈ మేరకు బండి సంజయ్ కుమార్ ఓ ప్రకటన విడుదల చేశారు. దేశవ్యాప్తంగా, ముఖ్యంగా ఐటీ రంగంలో పనిచేస్తున్న ఉద్యోగులపై మతపరమైన ఒత్తిళ్లు, వేధింపులు, రహస్య నెట్‌వర్క్‌ల ప్రభావం ఉండకూడదని తెలిపారు. హైదరాబాద్‌లో లక్షలాది మంది ఐటీ మిగతా2లో...

## వికసిత భారత్ లక్ష్య సాధనలో
# మినరల్స్ కూడా కీలకమే...

**● మినరల్ రంగంలో ఆత్మనిర్భరత భారత్‌పై ప్రత్యేక దృష్టి**

**● కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెల్లడి**



**హైదరాబాద్, 13 (పిసిడబ్ల్యు న్యూస్):** ప్రపంచ వ్యాప్తంగా క్రిటికల్ మినరల్స్ ప్రాముఖ్యం పెరుగుతోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. 2047 వికసిత భారత్ లక్ష్యాన్ని సాధించడంలో మినరల్స్ కీలకమని చెప్పుకొ చ్చారు. మినరల్ రంగంలో ఆత్మనిర్భరత సాధించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు కిషన్ రెడ్డి తెలిపారు. సోమవారం హెచ్ఐసీసీలో భారత ప్రభుత్వ గనుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 2వ విడత ఎక్స్‌ప్లోరేషన్ లైసెన్స్ వేలం, 7వ విడత క్రిటికల్,

మిగతా2లో...




# భూ పరిపాలనకు కొత్త దిక్సూచి భూభారతి

- చరిత్రాత్మక చట్టానికి నేటితో ఏడాది పూర్తి
- ఏడాదిలో 5కోట్లకు పైగా భూభారతి పోర్టల్ సందర్శన
- 70 లక్షల మంది పోర్టల్ ద్వారా లాగిన్
- 3.80లక్షల మందికి పాస్‌బుక్‌ల జారీ: మంత్రి పొంగులేటి

# పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధమేఘాలు

(మొదటి పేజీ తరువాయి)

అధ్యక్షుడు ట్రంప్ సలహాదారులు ప్రణాళికలు రచిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ పలు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. అయితే, ఈ దాడులకు ట్రంప్ అంగీకరిస్తారా? లేదా అనేదానిపై ఇంకా స్పష్టత లేదు. ఇరాన్ (ఎసజీని)ను నలువైపులా నిర్బంధించి, హర్మూజ్ జలసంధిపై నియంత్రణ తెచ్చుకోవాలని ట్రంప్ భావిస్తున్నట్లు సమాచారం. మిత్ర దేశాలతో కలిసి ఈ మార్గంలో ప్రయాణించే నౌకలకు భద్రత కల్పించే అంశంపై అమెరికా అధ్యక్షుడు చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. అటు, ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ కూడా ఇరాన్‌పై దాడులు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని ఐడీఎఫ్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ లెఫ్టినెంట్ జనరల్ ఇయాల్ జమీర్ తన సైన్యాన్ని ఆదేశించినట్లు ఇజ్రాయెల్ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఇరాన్‌పై దాడుల పునరుద్ధరణ విషయంలో ట్రంప్ నిర్ణయం కోసం ఇజ్రాయెల్ ఎదురు చూస్తున్నట్లు ఆ కథనాలు తెలిపాయి. అయితే, ఈలోగా టెహ్రాన్ తమపై దాడి చేస్తే మాత్రం ప్రతిస్పందన తీవ్రంగా ఉంటుందని ఐడీఎఫ్ హెచ్చరిస్తోంది. ఇదిలా ఉండగా.. యూఎస్-ఇరాన్ చర్చలు విఫలం కావడంతో పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్తతలు చెలరేగాయి. ఇరాన్ పోర్టుల నుంచి నౌకలు హోర్ముజ్ మీదుగా రాకపోకలు సాగించకుండా నేటి సాయంత్రం 7.30 (భారత కాలమానం ప్రకారం) నిర్బంధం విధిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. దీంతో పాటు ఇరాన్‌పై యూఎస్, ఇజ్రాయెల్‌లు మళ్లీ దాడులు చేసేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి.అణు కార్యక్రమాన్ని వదులుకునేలా ఇరాన్‌పై ఒత్తిడి తెచ్చేందుకు ఇజ్రాయెల్ దాడులను ప్లాన్ చేస్తున్నట్టు మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఆర్మీ సిద్ధంగా ఉండాలని ఇప్పటికే ఇజ్రాయెల్ రక్షణ దళం చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ జమీర్ ఆదేశించారు. మరోవైపు, ఇరాన్‌పై పరిమిత స్థాయిలో దాడులు చేసేందుకు ట్రంప్, ఆయన సలహాదారులు యోచిస్తున్నట్టు తెలుస్తోంది. ఇరాన్‌ను అన్ని వైపుల నుంచి దిగ్బంధించి చర్చల్లో ప్రతిష్టంభనను తొలగించాలనేది యూఎస్ ప్రభుత్వం ఉద్దేశమని కథనాలు వెలువడ్డాయి. ఈ దిశగా నాటో దేశాలను కూడా రంగంలోకి దింపేందుకు అమెరికా ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే హోర్ముజ్ మీదుగా నౌకల రాకపోకలను ఇరాన్ నిలిపివేసిన విషయం తెలిసిందే. హోర్ముజ్ జలాల్లోకి యూఎస్ యుద్ధ నౌకలు వస్తే దాడులు తప్పవని హెచ్చరించింది. చర్చలు విఫలం కావడానికి అమెరికానే కారణమని తేల్చి చెప్పింది. యూఎస్ పెట్టిన అసమంజసమైన డిమాండ్స్ కారణంగానే చర్చల్లో పీటముడి పడిందని పేర్కొంది. అణు కార్యక్రమం వదులుకునే దిశగా ఇరాన్ నుంచి స్పష్టమైన హామీలు రాలేదని యూఎస్ ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ పేర్కొన్నారు

# మహిళా రిజర్వేషన్లతో పునర్విభజన లింక్

(మొదటి పేజీ తరువాయి)

రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగిస్తోందని విమర్శించారు. ముఖ్యంగా 2011 జనాభా లెక్కల ఆధారంగా ఈ రెండు అంశాలను అనుసంధానించడం వెనుక రాజకీయ కుట్ర, వివక్ష ఉన్నాయని అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు తమ పూర్తి మద్దతు ఉందని ప్రకటించిన సీఎం రేవంత్, ప్రస్తుతం ఉన్న పార్లమెంట్ సీట్ల ఆధారంగానే ఈ బిల్లును అమలు చేయాలని కేంద్రాన్ని కోరారు. 2024 సార్వత్రిక ఎన్నికల సమయంలోనే ఈ బిల్లును అమలు చేసి ఉంటే, మరింత మంది మహిళలు పార్లమెంట్‌కు ఎన్నికయ్యేవారని రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. రాజ్యాంగంలోనే పురుషులతో పాటు మహిళలకు ఓటు హక్కు ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. అప్పటికిప్రపంచంలోని చాలా దేశాల్లో మహిళలకు ఓటు హక్కు లేదు.పురుషులతో పాటు మహిళలకు సమాన అవకాశాలు కల్పించింది కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని అన్నారు. దేశ ప్రధానిగా, రాష్ట్రపతిగా, లోక్ సభస్పీకర్ గా, ముఖ్యమంత్రులుగా, గవర్నర్లుగా చాలా రాజ్యాంగబద్దమైన పదవుల్లో మహిళలకు కాంగ్రెస్ అవకాశం కల్పించిందని గుర్తు చేశారు. మహిళలనాయకత్వంలోపనిచేసిన పార్టీ కాంగ్రెస్.. రాజీవ్ గాంధీ స్థానిక సంస్థల్లోమహిళలకు రిజర్వేషన్లు తీసుకువచ్చారు.. సోనియా గాంధీ నాయకత్వంలో చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ బిల్లు తీసుకువచ్చారు.. అప్పుడు రాజ్యసభలో ఆమోదించారు..బీజేపీ సహకరించక పోవడం వల్లనే లోక్ సభలో మహిళారిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందలేదన్నారు. ఇంతకాలం ప్రధాని మోదీ ఈ బిల్లును పట్టించుకోలేదు. 2023 లో మహిళారిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతుఇచ్చింది.. 2026 జనాభాలెక్కల తర్వాతగెజిట్ ఆధారంగా మహిళా రిజర్వేషన్లు అమలు చేస్తామని చట్టం చేశారు... 2026జనభా లెక్కలు పూర్తి చేసి అమలు చేయకుండా 2011జనాభాలెక్కల ఆధారంగా చట్టం ముందుకు తెస్తున్నారు.. 2026జనాభా లెక్కలప్రకారం నిబంధనను సవరించుకుంటే 2029 లోక్ సభతో పాటు వివిధ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్లు అమలుచేయోచ్చన్నారు. ఇకపోతే 2011 జనాభా లెక్కల ప్రకారం డీలిమిటేషన్ చేయాలని ఎన్డీయే చూస్తోందన్నారు. కానీ, 2026 జనాభా లెక్కల ప్రకారం డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలన్నది కాంగ్రెస్ డిమాండ్ అని చెప్పారు. ఈ రెండింటినీ కలపడం, పాత జనాభా లెక్కల ప్రకారం వెళ్లడంలో కుట్ర ఉందని ఆక్షేపించారు. 33శాతం మహిళా రిజర్వేషన్లకు కాంగ్రెస్ సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. చిన్న రాష్ట్రాలు, దక్షిణాదికి అన్యాయం జరిగేలా మోదీ కుట్ర చేస్తున్నారు. కుటుంబ నియంత్రణను దక్షిణాది రాష్ట్రాలు సమర్థంగా అమలు చేశాయి. ఉత్తరాదిలో అది సరిగ్గా అమలు కాకపోవడం వల్లే జనాభా విపరీతంగా పెరిగింది. జనాభా ప్రాతిపదికన సీట్ల పెంపు వద్దని దక్షిణాది రాష్ట్రాలు గట్టిగా చెప్పాయి. దక్షిణాది రాష్ట్రాల వ్యతిరేకత వల్ల మోదీ కొత్త ప్రతిపాదన తీసుకొచ్చారు. ప్రతి రాష్ట్రంలో 50శాతం సీట్లు పెంచుతామని చెబుతున్నారు. ఇలా చేస్తే.. యూపీ, బిహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లలో సీట్లు బాగా పెరగనున్నాయి. ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల మధ్య లోక్‌సభ సీట్లలో అంతరం భారీగా పెరుగుతుందన్నారు. సీట్ల పెంపు తర్వాత దక్షిణాదిలో 195 లోక్‌సభ స్థానాలు అవుతాయి. ఉత్తరాదిలో సీట్లు 620కి పెరుగుతాయి. ఉత్తర, దక్షిణాది మధ్య ప్రస్తుతం ఉన్న 210 సీట్ల అంతరం 412కి పెరుగుతుంది. ఎన్డీయే ప్రభుత్వంలో దక్షిణాది రాష్ట్రాలకు ఏమాత్రం ప్రాధాన్యం దక్కడం లేదు. కేంద్రంలోని కీలక శాఖలు ఏవీ దక్షిణాది రాష్ట్రాలకు ఇవ్వడం లేదు.దీనికి మేం వ్యతిరేకం. దక్షిణాది రాష్ట్రాలు దేశానికి ఫైనాన్షియల్ కేపిటల్స్. ఉత్తరాది రాష్ట్రాలు పొలిటికల్ కేపిటల్స్. పొలిటికల్ కేపిటల్స్ ఎప్పుడూ ఫైనాన్షియల్ కేపిటల్స్‌ని తక్కువగా చూస్తాయి.

దక్షిణాది రాష్ట్రాలు ద్వితీయ శ్రేణి పౌరులుగా మిగిలిపోతారని అన్నారు. హైబ్రిడ్ ప్రాతిపదికన సీట్లు పెంచాలనేది మా డిమాండ్. కొత్తగా పెంచే సీట్లలో 50 శాతానికి జీడీపీని ప్రాతిపదికగా తీసుకోవాలి. కొత్తగా పెంచే సీట్లలో 136 సీట్లు జీడీపీ వృద్ధి ఆధారంగా పెంచాలి. మరో 136 సీట్లను జనాభా ప్రాతిపదికగా పెంచాలి. దేశానికి ఆదాయం ఇస్తున్న రాష్ట్రాలను గౌరవించాలి. చిన్న రాష్ట్రాలకు కూడా న్యాయం జరిగేలా గతంలో సీట్ల కేటాయింపు జరిగిందని రేవంత్‌రెడ్డి అన్నారు. మీడియా సమావేశంల మంత్రులు భట్టి విక్రమార్క, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి, సీతక్క, పొంగులేటి, ఎంపిలు రఘురామిరెడ్డి, మల్లు రవి, సలహాదారు కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

# వికసిత భారత్ లక్ష్య సాధనలో మినరల్స్ కూడా కీలకమే...

(మొదటి పేజీ తరువాయి)

స్ట్రాటజిక్ మినరల్ బ్లాక్స్ వేలం కార్యక్రమానికి కేంద్ర మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. జియోపాలిటిక్స్, క్లైమేట్ మార్పు, ఆర్థిక భద్రతలో ఈ మినరల్స్ కీలక పాత్ర పోషిస్తున్నాయని వివరించారు. ఇప్పటివరకు 46 బ్లాక్స్ వేలం విజయవంతంగా పూర్తి చేశామని కేంద్ర మంత్రి వెల్లడించారు. 7వ విడతలో 19 బ్లాక్స్‌ల వేలం ప్రారంభమైందన్నారు. మినరల్ ఎక్స్‌లో రేషన్ లైసెన్స్ మొదటి విడత ప్రారంభమైందని.. త్వరలోనే 11 బ్లాక్స్‌లకు రెండో విడత లైసెన్స్ వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. తెలంగాణలో 2 వెనేడియం, టైటానియం బ్లాక్స్ సిద్ధం చేసినట్లు మంత్రి ప్రకటించారు. మైనింగ్ కార్యకలాపాలను వేగవంతం చేయడం కోసం చట్టాల్లో మార్పులు తీసుకొస్తున్నామని చెప్పారు. రాష్ట్రాలు స్వతంత్రంగా వేలం నిర్వహించే అవకాశం కల్పించనున్నట్లు చెప్పారు. పర్యావరణ అనుమతుల ప్రక్రియను సరళీకరించడం, 24 మినరల్స్‌పై కస్టమ్స్ డ్యూటీ రద్దు చేయడం, త్వరగా ఉత్పత్తి ప్రారంభించే కంపెనీలకు ప్రోత్సాహకాలు అందించడం వంటి చర్యలు తీసుకోనున్నట్లు కిషన్ రెడ్డి వివరించారు. స్క్రాప్ నుంచి మినరల్స్ రీసైక్లింగ్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. విదేశాల్లో మైనింగ్ ప్రయత్నాలు చేపట్టామని తెలిపారు. రక్షణ రంగం, ఎలక్ట్రిక్ వెహికల్స్, గ్రీన్ ఎనర్జీకి క్రిటికల్ మినరల్స్ కీలకమని.. ప్రైవేట్ సంస్థలు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. భారత్‌ను గ్లోబల్ మైనింగ్ లీడర్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.

# భూ పరిపాలనకు కొత్త దిక్సూచి భూభారతి

**హైదరాబాద్,ఏప్రిల్ 13 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఆనాటి బిఆర్ఎస్ ప్రభుత్వంలో కుప్పకూలిన రెవెన్యూ వ్యవస్థను గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో పునర్నిర్మిస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. భూహక్కుల పరిరక్షణ, పారదర్శకత, అవినీతి రహిత సేవలు సామాన్యుడికి సులభంగా అందేలా గత ఏడాది రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన భూభారతి చట్టం తెలంగాణ చరిత్రలో కీలక సంస్కరణగా నిలుస్తోందన్నారు. ఈనెల 14వ తేదీతో భూభారతి చట్టం అమలులోకి వచ్చి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా సోమవారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో మంత్రి గారు అధికారులతో భూభారతి చట్టంపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇది కేవలం ఒక చట్టానికి ఏడాది పూర్తైన సందర్భం మాత్రమే కాదని, తెలంగాణ రాష్ట్రంలో భూహక్కుల రక్షణకు ప్రారంభమైన కొత్త శకానికి నాందిపలికిన రోజని వ్యాఖ్యానించారు. భూభారతి చట్టానికి ముందు ఆ తర్వాత ఉన్న పరిస్థితులపై అధికారులతో చర్చించారు. ఈ చట్టం తీసుకువచ్చే నాటికి ధరణి పోర్టల్ వల్ల తెలంగాణ ప్రజానీకం ఎదుర్కొన్న పరిస్థితులను ఈ సందర్భంగా మంత్రిగారు గుర్తు చేశారు. 'నాటి పరిస్థితిని పూర్తిగా మార్చాలన్న సంకల్పంతో పారదర్శకత, బాధ్యతాయుత, వేగం అనే మూడు ప్రధాన సూత్రాలతో రెవెన్యూ వ్యవస్థను ప్రజలకు చేరువచేస్తున్నాం. ఈ క్రమంలోనే చారిత్రాత్మకమైన భూభారతి చట్టాన్ని తీసుకువచ్చాం. ఈ చట్టం రాష్ట్రంలోని భూ పరిపాలనను పారదర్శకంగా సులభంగా మార్చింది. బిఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో సరైన విధివిధానాలు లేకుండా తీసుకొచ్చిన 2020 ఆర్వోఆర్ చట్టం, ధరణి పోర్టల్ వల్ల లక్షలాది మంది ప్రజలు తమ భూముల హక్కుల విషయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. భూమి తమదే అయినప్పటికీ హక్కులను నిరూపించుకునేందుకు అధికారుల, కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేది. ఆనాటి పరిస్థితులను చూసి అధికారంలోకి వచ్చిన వెంటనే ధరణి పోర్టల్‌ను బంగాళాఖాతంలో కలుపుతామని ఇచ్చిన మాటను నిలబెట్టుకొని గత ఏడాది ఏప్రిల్ 14న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి రోజున గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారి చేతుల మీదుగా భూభారతి పోర్టల్‌ను ఆవిష్కరించుకున్నాం. తెలంగాణ రైతాంగానికి భూ భద్రత కల్పించడంలో భూభారతి ఒక బలమైన ఆయుధంగా మారింది. భూ వివాదాలకు చరమగీతం పాడుతూ, సామాన్యుడికి రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగే తిప్పలు తగ్గించడంలో ఈ ఏడాది కాలం ఒక గొప్ప ముందడుగుగా నిలిచింది. ఈ 12 నెలల కాలంలో భూభారతి పోర్టల్ పాత చిక్కుముడులను విప్పడంలో కీలక పాత్ర పోషించింది. ఈ పోర్టల్ ప్రారంభించిన ఏడాదిలోపే 5.20 కోట్లకు పైగా ప్రజలు ఈ పోర్టల్‌ను సందర్శించారు. సుమారు 67 లక్షల మంది పోర్టల్ ద్వారా లాగిన్ అయ్యారు. ప్రజల కోసం రెవెన్యూ శాఖ లో గణనీయమైన మార్పులు తెస్తున్నాం. రైతులకు పారదర్శకంగా సులభతరమైన సేవలు అందించడానికి రెవెన్యూ, సర్వే, స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ విభాగాలను ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చి కేంద్ర ప్రభుత్వం సంస్థ ఎన్.ఐ.సి.తో కలిసి రూపొందించిన ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్‌ను ఈనెల 2వ తేదీ నుంచి ఐదు జిల్లాల్లోని ఐదు మండలాల్లో? ప్రయోగాత్మకంగా ప్రారంభించడం జరిగింది. ఇక్కడ ఎదురయ్యే మంచి చెడులను పరిగణనలోకి తీసుకొని అవసరమైన మార్పులు చేర్పులు చేసి వచ్చే నెలలో జిల్లాకు ఒక మండలంలో ప్రారంభిస్తాం.ఈ ఐదు మండలాల్లో కూడా ప్రతి సర్వే నెంబరుకు భూధార్ నెంబర్‌ను కేటాయిస్తాం. రాష్ట్రంలో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపాలన్న సంకల్పంతో మా ప్రభుత్వం పనిచేస్తోంది. రాష్ట్రంలో నిజాం కాలం నుంచి 378 గ్రామాలను నక్షాలు లేవు. ఇందులో ఐదు గ్రామాలలో రీ సర్వే పూర్తి చేసి భూధార్ నెంబర్ కేటాయించాం.మిగిలిన 373 గ్రామాల్లో రోవర్స్ వంటి ఆధునిక సర్వే సాంకేతికతను ఉపయోగించి రీసర్వే పనులు కొనసాగిస్తున్నాం. ఇప్పటికే 411 రోవర్లను కొనుగోలు చేశాం. త్వరలో మరో 400 కొనుగోలు చేయబోతున్నాం. భూ భారతి పోర్టల్ ప్రారంభించిన గత ఏడాది ఏప్రిల్ 14 నుంచి ఇప్పటి వరకు 3.80 లక్షల పాస్ బుక్ లు జారీచేశాం.'అని వివరించారు

# ఐటి ఉద్యోగుల భద్రతపై ప్రత్యేక దృష్టి

(మొదటి పేజీ తరువాయి)

ఉద్యోగులు ఉన్నందున వారి పని వాతావరణం కేవలం కెరీర్ అభివృద్ధికి మాత్రమే పరిమితం కావాలని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వానికి బండి సంజయ్ కొన్ని కీలక సూచనలు చేశారు. అన్ని ప్రధాన ఐటీ కంపెనీల హెచ్‌ఆర్ బృందాలతో తక్షణ సమావేశం నిర్వహించాలని సూచించారు. ఉద్యోగుల భద్రతపై స్పష్టమైన విధానాలు రూపొందించాలని అన్నారు. ఉద్యోగుల ఫిర్యాదులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఏ కేసును కూడా దాచిపెట్టకూడదని చెప్పుకొచ్చారు. ఉద్యోగులు కార్యాలయాల్లో స్వేచ్ఛగా, భద్రతతో పనిచేసే వాతావరణం ఉండాలని బండి సంజయ్ కుమార్ సూచించారు. ఏ రకమైన ఒత్తిడి, వేధింపులు, దోపిడీకి అవకాశం ఇవ్వకూడదని స్పష్టం చేశారు. అలాగే, బాధితులు ఒంటరిగా ఉండకుండా వారికి తగిన రక్షణ, మద్దతు అందించాలని సూచించారు. పలువురు ఉద్యోగులు ఇప్పటికే కార్యాలయాల్లో జరిగిన అనుభవాలను సోషల్ మీడియాలో పంచుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ హెచ్చరిక సంకేతాలను ప్రభుత్వం, కంపెనీలు నిర్లక్ష్యం చేయకూడదని సూచించారు. ఐటీ కంపెనీల యాజమాన్యాలు, హెచ్‌ఆర్ విభాగాలు ఉద్యోగుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని బండి సంజయ్ కుమార్ కోరారు. ప్రతి ఫిర్యాదును నిష్పక్షపాతంగా, వేగంగా పరిష్కరించాల్సిన అవసరం ఉందని చెప్పారు. నాసిక్ కేసు నేపథ్యంలో వచ్చిన ఈ వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా ఐటీ రంగ భద్రతపై చర్చను మరింత పెంచాయని తెలిపారు. ఉద్యోగుల రక్షణ, కార్యాలయాల్లో పారదర్శకత, ఫిర్యాదు వ్యవస్థ బలోపేతం వంటి అంశాలు ఇప్పుడు కీలకంగా మారాయని పేర్కొన్నారు.

# బిఆర్ఎస్‌తో పొత్తు ఇక్కడికే పరిమితం

(మొదటి పేజీ తరువాయి)

అన్నారు. కాంగ్రెస్ అధికారబలం ఖానాపూర్‌లో పనిచేయలేదని ఆయన పేర్కొన్నారు. తలసరి ఆదాయం ఉంటేనే అసెంబ్లీ సీట్లు పెంచాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు బాధాకరమని రాంచందర్ రావు విమర్శించారు. ఈ వ్యాఖ్యలు పేదవారిని, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధిని అణచివేయాలనే ఉద్దేశంతో చేసినట్లుగా ఉన్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. 50 ఏళు పాలించిన కాంగ్రెస్ పార్టీ ఎన్నడూ మహిళల హక్కుల గురించి మాట్లాడలేదని వ్యాఖ్యానించారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు బీజేపీ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. వికసిత్ భారత్ లక్ష్యంతో ఏప్రిల్ 16న మహిళా రిజర్వేషన్ కోసం ప్రత్యేక బిల్లును ప్రవేశపెట్టనుందని తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు వెల్లడించారు.

# రాష్ట్రపతిని కలిసిన లోకేశ్ బృందం

(మొదటి పేజీ తరువాయి)

ఏపీ మంత్రి నారా లోకేశ్, కూటమి ఎంపీలు ముర్ముతో భేటీ అయ్యారు. అమరావతి బిల్లు చట్టరూపం దాల్చడంతో.. లోకేశ్ బృందం రాష్ట్రపతికి ధన్యవాదాలు తెలిపింది. ఈ సందర్భంగా అమరావతి చారిత్రక, సాంస్కృతిక ప్రాధాన్యాన్ని రాష్ట్రపతికి లోకేశ్ వివరించారు. అమరావతి రాజధాని ప్రజల కల అన్నారు. ఇందుకోసం రైతులు 33 వేల ఎకరాలు ఉదారంగా ఇచ్చారని అన్నారు. గత ఐదేళ్ల జగన్ పాలనలో జరిగిన నష్టాన్ని వివరించారు.

# 48 గంటల్లో క్షమాపణ చెప్పాలి

(మొదటి పేజీ తరువాయి)

స్పష్టం చేశారు. అయినప్పటికీ తన ప్రతిష్టను దెబ్బతీసేలా కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మొత్తం టెండర్ విలువ రూ.44.42 కోట్లేనని గుర్తుచేశారు. అందులో రూ.30 కోట్ల అవినీతి జరిగిందని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఇది పూర్తిగా ఆధారాలు లేని ఆరోపణ అని కొట్టిపారేశారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఒక్కో మొబైల్‌ను రూ.11,650కే కొనుగోలు చేశామని వివరించారు. ఇతర రాష్ట్రాల కంటే తక్కువ ధరకు టీజీటీఎస్ ద్వారా వాటిని కొనుగోలు చేశామని వివరించారు. బీఆర్ఎస్ తన అధికారిక సోషల్ మీడియా వేదికగా తనపై చేస్తున్న దుష్ప్రచారానికి పార్టీ అధినేతగా కేసీఆరే బాధ్యత వహించాలని సీతక్క డిమాండ్ చేశారు. 48 గంటల్లో ఆయా సోషల్ మీడియాల్లో పోస్టుల ను తొలగించాలని డిమాండ్ చేశారు. లేదంటే కేసీఆరే స్వయంగా క్షమాపణ చెప్పాల్సి వస్తుందని హెచ్చరించారు. గతంలో కూడా తనపై ఇలాగే తప్పుడు ఆరోపణలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా కేటీఆర్ ప్రశ్నలకు తాను గట్టిగా సమాధానం చెప్పిన తర్వాతనే తనపై ఇలాంటి దాడి మొదలైందని సీతక్క గుర్తుచేశారు.

# కూల్చివేతలు ఆపండి

(మొదటి పేజీ తరువాయి)

ఏ చట్ట ప్రకారం కూల్చివేస్తున్నారో, కూల్చివేతలకు అమలు చేసే విధివిధానాలు ఏమిటో, అనుసరించే మార్గదర్శకాలు ఏమిటో తెలియజేసే వరకు కూల్చివేతలు ఆపాలని కోరింది. ప్రజావసరాలైన చెరువులు, కుంటలు, ఇతర నీటివనరులు, నాలాలు, పార్కులు, రోడ్లు వంటివి ఆక్రమణలకు గురైతే వాటి విషయంలో ముందుకు వెళ్లవచ్చని స్పష్టం చేసింది. నోటీసు ఇవ్వకుండా అమీన్‌పూర్ మండలం ఐలాపూర్ గ్రామానికి చెందిన రైతు ఎంఎ షరీఫ్ దాఖలు చేసిన లంచ్ మోషన్ పిటిషన్‌పై జస్టిస్ బి విజరుసేన్‌రెడ్డి సోమవారం విచారించి ఈ ఉత్తర్వులను జారీ చేశారు. పది దశాబ్ధాలనాటి ఆస్తిలో నిర్మాణమైన నీటి ట్యాంక్, కాంపౌండ్ వాల్ వంటివి హైడ్రా స్టాఫ్ తెల్లవారు జామున కూల్చేశారని లాయర్ చెప్పారు. సర్వే నెంబర్ 165 నుంచి 175, 212, 213లోని 36.37 ఎకరాల విషయంలో హైకోర్టు ఆర్డర్‌ను అడ్డంపెట్టుకుని మిగిలిన వెయ్యి ఎకరాలను కబ్జా చేసిన వాళ్లు కూడా అక్రమ నిర్మాణాలను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారని ప్రభుత్వ న్యాయవాదులు చెప్పారు.దీనిపై హైకోర్టు పిటిషనర్లు సమర్పించిన వీడియోను పరిశీలించి హైడ్రా తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. జీహెచ్‌ఎంసీ, మున్సిపాలిటీల చట్టం లేదంటే ఏ ఇతర చట్టాల కింద హైడ్రా విధులకు సంబంధించి ప్రామాణిక కార్యాచరణ విధానాలు లేదా మార్గదర్శకాలను కోర్టుకు నివేదించే వరకు కూల్చివేతలు చేయరాదని హైడ్రాను ఆదేశించింది.

# బిజిగిరి షరీఫ్‌లో యువతి మృతి...
## బీఎస్పీ నేతల ఘన నివాళులు



**జమ్మికుంట,ఏప్రిల్ 13 (పిసిడబ్ల్యూ న్యూస్):** జమ్మికుంట మండలం బిజిగిరి షరీఫ్ గ్రామానికి చెందిన చిట్యాల ఇంద్ర ఓదెలు కుమార్తె ప్రణతి ( 24) అనారోగ్యంతో మృతి చెందగా సోమవారం బహుజన్ సమాజ్ పార్టీ హుజరాబాద్ నియోజకవర్గం ఇన్చార్జ్ డాక్టర్ అంబాల ప్రభాకర్ (ప్రభు) పార్టీ నాయకులతో కలిసి వెళ్లి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు, మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని,వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేసి పరమర్శించారు.ఈ కార్యక్రమం బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ ) ఎమ్మెల్యే ఎంపీ కంటెస్టెడ్ అభ్యర్థి మారపల్లి మొగిలయ్య, నాయకులు రమేష్, ప్రవీణ్, శ్రీకాంత్, యుగంధర్, అంబాల రాజు తదితరులు పాల్గొన్నారు.

# కాకతీయ కళాశాలలో పోటీ పరీక్షలకు సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం..

**హనుమకొండ : ఏప్రిల్ 13 (పిసిడబ్ల్యూ న్యూస్):** కాకతీయ ప్రభుత్వ కళాశాల (అటానమస్), హనుమకొండ లోని పోటీ పరీక్షల విభాగము ఆధ్వర్యంలో నేడు పోటీ పరీక్షలలో సైన్స్ అండ్ టెక్నాలజీ యొక్క ప్రాముఖ్యత గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించబడినది. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ గుర్రం శ్రీనివాస్ వ్యవహరించగా రిసోర్స్ పర్సన్ గా డాక్టర్ భగీరత్ పాల్గొని వివిధ పోటీ పరీక్షల్లో జాతీయ మరియు రాష్ట్రస్థాయిలో మరియు విద్యాశాఖలో పడే పోటీ పరీక్షలలో సైన్స్ అండ్ టెక్నాలజీ నుండి ప్రశ్నలు ఏ విధంగా వస్తాయి ఎలా వాటికి సమాధానం ఇవ్వాలి అనే విషయం గురించి వివరించడం జరిగినది. ఈ కార్యక్రమం లో వైస్ ప్రిన్సిపాల్



రజనీలత మాట్లాడుతూ విద్యార్థులందరూ కూడా సైన్స్ అండ్ టెక్నాలజీ లో పరిజ్ఞానం సంపాదించాలని తెలియజేశారు, వైస్ ప్రిన్సిపల్ మరియు వాణిజ్యశాస్త్ర విభాగ అధిపతి ప్రొఫెసర్ రాజశేఖర్ మాట్లాడుతూ వివిధ పోటీ పరీక్షలలో సైన్స్ అండ్ టెక్నాలజీ నుండి కూడా ప్రశ్నలు వస్తాయి కాబట్టి విద్యార్థులు సంపూర్ణంగా విజ్ఞానం సంపాదించి విజయం



సాధించాలని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పోటీ పరీక్షల విభాగపు కన్వీనర్ డాక్టర్ బైరి శ్రీనివాస్ ఐ క్యూ ఏ సి కోఆర్డినేటర్ ప్రొఫెసర్ శ్రీనాథ్, సభ్యులు ప్రొఫెసర్ వెంకటరమణ, దేవుడు నాయుడు, ప్రదీప్ శ్రావణ్ లు పాల్గొనడం జరిగింది.

# పరకాల 22వ వార్డులో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం



**పరకాల, ఏప్రిల్ 13 (పిసిడబ్ల్యూ న్యూస్):** పరకాల పట్టణంలోని 22వ వార్డులో వైనాలా కవిత ప్రభాకర్ దంపతులు నిర్మించిన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి వార్డు కౌన్సిలర్ అల్లే దశరథం హాజరై, గృహప్రవేశం జరుపుకుంటున్న దంపతులను శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ అల్లే దశరథం మాట్లాడుతూ, ప్రతి కుటుంబానికి సొంత ఇల్లు కలగాలని ప్రభుత్వాలు తీసుకుంటున్న సంకల్పంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం కీలక పాత్ర పోషిస్తోందన్నారు. వైనాలాకవిత ప్రభాకర్ దంపతులు సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పోరండ్ల వేణు, కేశ బోయిన అజయ్ పాల్గొని, గృహప్రవేశం జరుపుకున్న దంపతులకు శుభాకాంక్షలు తెలియజేశారు. స్థానిక ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# సామాజిక విప్లవ శిఖరం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్

భారతదేశ చరిత్ర పుటల్లో కొన్ని పేర్లు కాలక్రమేణా మసకబారుతాయి, కానీ మరికొన్ని పేర్లు కాలం గడిచేకొద్దీ మరింత ప్రకాశిస్తాయి. అటువంటి ధ్రువతారే డాక్టర్ భీంరావ్ రామ్ జీ అంబేద్కర్. అంటరానితనం అనే చీకటి అగాధాల నుండి ఉద్భవించి, భారత రాజ్యాంగ నిర్మాతగా దేశ భవిష్యత్తును తీర్చిదిద్దిన ఆయన ప్రస్థానం కేవలం ఒక వ్యక్తి విజయగాథ కాదు; అది ఒక సామాజిక విప్లవం. మహో సైనిక శిబిరంలో ఒక సాధారణ మహర్ కుటుంబంలో జన్మించిన అంబేద్కర్, చిన్నతనంలోనే కుల వివక్ష విషపు కోరలను రుచి చూశారు. తరగతి గది బయట కూర్చోవడం, కనీసం తాగే నీటి కోసం ఇతరులపై ఆధారపడటం వంటి అవమానాలు ఆయనను కుంగదీయలేదు. బదులుగా, ఆ గాయాలనే ఆయన తన లక్ష్యానికి ఇంధనంగా మార్చుకున్నారు. "జ్ఞానమే శక్తి" అని నమ్మిన ఆయన, విదేశీ గడ్డపై కొలంబియా విశ్వవిద్యాలయం, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ వంటి ప్రతిష్టాత్మక సంస్థల నుండి డాక్టరేట్లు పొంది, ప్రపంచస్థాయి మేధావిగా ఎదిగారు. అంబేద్కర్ కేవలం పుస్తకాలకే పరిమితం కాలేదు. తన విజ్ఞానాన్ని సమాజ మార్పు కోసం ఆయుధంగా మలిచారు. 'మూక్ నాయక్', 'బహిష్కృత్ భారత్' వంటి పత్రికల ద్వారా అణచివేతకు గురైన వర్గాల గొంతుకగా నిలిచారు. కేవలం నినాదాలతో సరిపెట్టకుండా, 'మహద్ సత్యాగ్రహం' ద్వారా పౌర హక్కుల పోరాటాన్ని వీధుల్లోకి తెచ్చారు. మనుస్మృతి దహనం ద్వారా సామాజిక అసమానతలకు మూలమైన భావజాలాన్ని సవాలు చేసిన ధీశాలి ఆయన. భారత రాజ్యాంగ ముసాయిదా కమిటీ అధ్యక్షుడిగా ఆయన పోషించిన పాత్ర అద్వితీయం. భిన్నత్వంతో కూడిన భారత దేశాన్ని 'సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం' అనే మూడు సూత్రాల ద్వారా




ఏకతాటిపైకి తెచ్చారు. ఆర్టికల్ 17 ద్వారా అంటరానితనాన్ని చట్టవిరుద్ధం చేయడం. హిందూ కోడ్ బిల్లు ద్వారా మహిళలకు ఆస్తి హక్కు, సామాజిక భద్రత కల్పించడం. కార్మిక హక్కులు మరియు ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ. ఇవన్నీ ఆయన దూరదృష్టికి నిదర్శనాలు. ఆయన కేవలం దళితుల నేత మాత్రమే కాదు; ఆధునిక భారత న్యాయ వ్యవస్థకు పునాది వేసిన గొప్ప రాజనీతిజ్ఞుడు. హిందూ మతంలోని సంస్కరణల పట్ల నిరాశ చెందినప్పటికీ, ఆయన హింసా మార్గాన్ని ఎంచుకోలేదు. శాంతి, సమానత్వం మెండుగా ఉన్న బౌద్ధాన్ని స్వీకరించి, తన చివరి రోజుల్లో లక్షలాది మందికి కొత్త జీవితాన్ని ప్రసాదించారు. "నేను హిందువుగా పుట్టాను కానీ, హిందువుగా మరణించను" అన్న తన మాటను నిలబెట్టుకుంటూ, మతం కంటే మానవత్వం గొప్పదని చాటిచెప్పారు. 1990లో భారత ప్రభుత్వం ఆయనను భారతరత్నతో గౌరవించడం ఆయన కీర్తికి దక్కిన ఒక చిన్న గుర్తింపు మాత్రమే. నేడు మనం అనుభవిస్తున్న ప్రజాస్వామ్య ఫలాలు, హక్కులు బాబాసాహెబ్ వేసిన పునాదులపైనే నిలబడి ఉన్నాయి. అక్షరాన్నే ఆయుధంగా మలచుకొని, ఆత్మగౌరవ పోరాటమే ఊపిరిగా బతికిన అంబేద్కర్, నవభారత నిర్మాణంలో నిరంతర స్ఫూర్తిప్రదాత. ఆయన చూపిన బాటలో నడవడమే మనం ఆయనకు అర్పించే నిజమైన నివాళి.






అంతడుపుల శ్రీనివాస్
సీనియర్ జర్నలిస్ట్ - వరంగల్
సెల్ : 7386814274

# అరైవ్ అలైవో ప్రోగ్రాం నిర్వహించిన సిరోల్ ఎస్ఐ

**● ద్విచక్ర వాహనదారులకు 30 హెల్మెట్లు పంపిణీ: చింతపల్లి సర్పంచ్ దీరవత్ వీరన్న**



**మహబూబాబాద్ జిల్లా సీరోల్ ఏప్రిల్ 13(పి.సి.డబ్ల్యూ న్యూస్):** ఎస్పి శబరిష్ ఆదేశాలతో డోర్నకల్ నియోజకవర్గం సిరోల్ మండలం చింతపల్లి గ్రామపంచాయతీ గ్రామ సర్పంచ్ ధీరావత్ వీరన్న, అధ్యక్షులు గ్రామసభ ఏర్పాటు చేసి అరైవ్ ఆలైవో ప్రోగ్రాం నిర్వహించిన సిరోల్ సబ్ ఇన్స్పెక్టర్ గంద్ర సతీష్ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్పంచ్ ధీరావత్ వీరన్న,ద్విచక్ర వాహనదారులు 30 హెల్మెట్లు తన సొంత ఖర్చులతో పంపిణీ చేశారని అన్నారు . ప్రధానంగా టు వీలర్ వాహనదారులు ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి అహనాలు నడపాలని ముఖ్యంగా యువత రోడ్డు ప్రమాదాలకు గురి అవుతున్నారని రోడ్డు ప్రమాదాలు నివారించాలి అంటే ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని సూచించారు. అదేవిధంగా గ్రామాల్లో డ్రగ్స్ గంజాయి మహమ్మారి బారిన ఎవరు పడకూడదని గ్రామంలో ప్రధాన కూడలిలల్లో "సీసీ కెమెరాలు" ఏర్పాటు చేసుకోవాలని గ్రామం మొత్తం సి సి ఫుటేజ్ కవరేజ్ లోకి రావాలని అన్నారు . ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ తేజావత్ . బద్రు , గ్రామ పంచాయతీ కార్యదర్శి లెలిన్ , గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జెర్రిపోతుల మహేష్. మహేష్ గౌడ్ , మాజీ ఎంపిటిసి భూక్య చందులాల్ నాయక్ , వార్డు మెంబర్స్ కొంపెల్లి సతీష్, మాదాల. సుజిత్ , భూతం. సారమ్మ , భూక్య భీంసాగర్ , గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కుర్ర యాకయ్య , మైనార్టీ నాయకులు ఎస్.కె . జానీ మియా , అవును దొడ్డి శ్రీశైలం , గంధసిరి యాకయ్య , చిర్రా అశోక్ , ఫీల్డ్ అసిస్టెంట్ నాగేశ్వరరావు , గ్రామ ప్రజలు యువకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

# నేడు హైదరాబాదులో జరగనున్న నీలి కవాతు సభను విజయవంతం చేయండి

**● జాతీయ అంబేద్కర్ అవార్డు రహిత రాయచోటి ఉపేందర్ మాదిగ పిలుపు**



**తొర్రూర్ ప్రతినిధి,ఏప్రిల్ 13(పిసిడబ్ల్యూ న్యూస్):** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135 వ జయంతి సందర్భంగా హైదరాబాదులో జరిగే నీలి కవాతును విజయవంతం చేయాలని జాతీయ అంబెద్కర్ అవార్డు గ్రహీత రాయిశెట్టి ఉపేందర్ మాదిగ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా తొర్రూరులో జరిగిన పత్రికా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా హైదరాబాదులోని బాగ్లింగంపల్లిలోని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం నుండి ట్యాంక్ బండ్ పై ఉన్న అంబేద్కర్ విగ్రహం వరకు సాయంత్రం 4 గంటలకు జరిగే నీలి కవాతును సభను విజయవంతం చేయాలని అంబేద్కర్ వాదులకు అణగారిన వర్గాల ప్రజలకు ఉద్యోగ కార్మిక కర్షకులకు అణగారిన వర్గాల ప్రజలకు తెలంగాణ రాష్ట్రం లోని అంబేద్కర్ వాదులు వేలాదిగా తరలివచ్చి నీలి కవాతు సభను విజయవంతం చేయాలని కోరారు.

# ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా చేపట్టే ప్రతీ కార్యక్రమన్ని విజయవంతం చెయ్యాలి

**● ప్రజా ప్రతినిధుల సమన్వయంతో కార్యక్రమాలు నిర్వహించాలి ● జిల్లాలో (టిబి) నివారణ కోసం ప్రత్యేక కార్యచరణ అమలు ● జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరీష్**

**మహబూబాబాద్ జిల్లా ఏప్రిల్13 (పి.సి.డబ్ల్యూ న్యూస్):** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం కింద ఏప్రిల్ 16 నుండి మే 15 వరకు నిర్వహించనున్న కార్యక్రమాల అమలుకు సంబంధించి జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం ఈ రోజు జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అధ్యక్షతన కలెక్టర్ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో క్షయవ్యాధి (టీబీ) కేసులను గుర్తించడం, వారికి తక్షణ చికిత్స అందించడం, అలాగే డెంగ్యూ, మలేరియా, చికున్ గున్యా వంటి సీజనల్ వ్యాధుల నివారణ నియంత్రణకు సంబంధించి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామ స్థాయి వరకు అవగాహన



కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు ముందస్తు జాగ్రత్తలు తెలియజేయాలని, ఆరోగ్య శానిటేషన్ కమిటీ లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ నెల 23 నుండి ఎడ్యుకేషనల కేంద్రాలు వేసవి సెలవుల దృష్ట్యా ఆ కేంద్రాల లోని వాటర్ ట్యాంక్ లను ఖాళీ చేసి కడిగి ఎండ పెట్టాలని సూచించారు. నూతనంగా గ్రామ స్థాయిలో హెల్త్ శానిటేషన్ కమిటీలు ఏర్పాటు చేసుకోవాలని, దోమల నివారణ నిల్వ ఉన్న నీటి కుంటల్లో ఆయిల్ బాల్స్ వేయాలని, ప్రజల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని, ఫ్లెక్సీలు, పోస్టర్స్ కరపత్రాలు ముద్రించి పట్టణాలు, గ్రామాలలో ఏర్పాటు చేయాలన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా చేపట్టే ప్రతీ ప్రజా ప్రతినిధులను ప్రజలకు ముందస్తు సమాచారం అందించి కార్యక్రమాల విజయవంతానికి చర్యలు తీసుకోవాలని సూచించారు, వైద్య సమస్యలు అధికంగా ఉన్న ప్రదేశాలను గుర్తించి వైద్య శిబిరాలు నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో, (రెవెన్యూ) కె.అనిల్ కుమార్, ఆర్డీఓలు కృష్ణవేణి, గణేష్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రవి రాథోడ్, సీఈఓ పురుషోత్తం, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సుధీర్, డిప్యూటీ డెమో ప్రసాద్, ఇతర లైన్ డిపార్ట్మెంట్ జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# నిర్లక్ష్యం వహించకుండా వాటికి పరిష్కార మార్గం చూపాలి

**● ప్రజావాణి - గిరివాణి కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యల పరిష్కారం: జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్**



**ములుగు ప్రతినిధి ఏప్రిల్ 13(పిసిడబ్ల్యూ న్యూస్ ):** ప్రజావాణి-గిరివాణి కార్యక్రమం లో ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో పరిష్కరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి-గిరివాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అర్జీదారుల సమస్యలను నేరుగా తెలుసుకుంటూ వారినుంచి దరఖాస్తులను స్వీకరించి ఆయా శాఖల అధికారులకు అందించి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణి - గిరివాణి కార్యక్రమంలో భూ సమస్యల గురించి 21, ఇందిరమ్మ ఇండ్ల గురించి 15, పెన్షన్స్ 16, ఉపాధి కల్పన 03, ఇతర శాఖలకు చెందినవి 17 మొత్తం 72 దరఖాస్తులు చేసుకున్నారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి గిరివాణి కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించడం జరుగుతుందని తెలియజేశారు . అధికారులు అర్జీ దారుల నుంచి స్వీకరించిన దరఖాస్తులను ఎట్టి పరిస్థితుల్లో నిర్లక్ష్యం వహించకుండా వాటికి పరిష్కార మార్గం చూపాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, ఆర్డీవో వెంకటేష్, జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎం పి డి ఓ లు, ఎం పి ఓ లు, పాల్గొన్నారు.

# ఇంటర్ ఫలితాల్లో సత్తాచాటిన బ్లూమింగ్ వోకేషనల్ కళాశాల విద్యార్థులు

**కరీంనగర్ టౌన్ ఏప్రిల్ 13(పిసిడబ్ల్యూ న్యూస్):** నిన్న విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాలలో నగరంలోని రేకుర్తి సూర్య నగర్ లో గల బ్లూమింగ్ ఒకేషనల్ జూనియర్ కళాశాల కరీంనగర్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర, జిల్లా స్థాయిలో ప్రభంజనం సృష్టించారు. పి. హారిక ఎంపిహెచ్ డబ్ల్యు రెండవ సంవత్సరం 949/1000, జె. అక్షయ ఎం పి హెచ్ డబ్ల్యు రెండవ సంవత్సరం సంవత్సరం 921/1000, పి. అంజలి ఐ అండ్ ఎం మొదటి సంవత్సరం 472/500, జి కృష్ణవేణి ఎం పి హెచ్ డబ్ల్యు మొదటి సంవత్సరం 442/500, ఎండి అఫ్రోజ్ ఎం పి హెచ్ డబ్ల్యు మొదటి సంవత్సరం 436/500, ఎమ్మెల్టీ రెండవ సంవత్సరం సతీష్ 846/1000లు అద్భుతమైన ఫలితాలను సాధించి విజయ దుందుభి మోగించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ ఎంఏ ఖుద్దూస్




మాట్లాడుతూ బ్లూమింగ్ ఒకేషనల్ కళాశాల విద్యార్థులు సాధించిన విజయం పట్ల హర్షం వ్యక్తం చేశారు. తమ కళాశాల సిబ్బంది కృషి, మార్గదర్శకత్వం వల్ల ఈ అద్భుత ఫలితాలు సాధ్యమయ్యాయని విజేతలైన విద్యార్థులను, అధ్యాపక టీమును, సిబ్బందిని అభినందించారు. భవిష్యత్తులో ఈ వృత్తి విద్య కోర్సుల ద్వారా, రాష్ట్ర ప్రభుత్వ కేంద్ర ప్రభుత్వ అటు విదేశాలలో మంచి డిమాండ్ తో కూడిన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థుల తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ వి నిర్మల, టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన బిఆర్ఎస్ మాజీ మంత్రి సత్యవతి రాథోడ్



**సీరోలు ఏప్రిల్ 13(పి.సి.డబ్ల్యూ న్యూస్):** మండలం చింతపల్లి గ్రామ మాజీ ఎంపీటీసీ హాథీరామ్ – విజయ దంపతుల కుమారుడు పవన్ కుమార్ – సాయి ప్రియ ల వివాహ రిసెప్షన్ సోమవారం రోజున చింతపల్లి గ్రామంలోని జిహెచ్ ఫంక్షన్ హాల్ లో జరగగా నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపిన మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ , బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు బజ్జూరి పిచ్చిరెడ్డి, బిఆర్ఎస్ యూత్ రాష్ట్ర నాయకులు గుగులోతు రవినాయక్,కురవి మండల మాజీ వైస్ ఎంపిపి దొంగలి నర్సయ్య, బీబీ నాయక్ తండా గ్రామ మాజీ సర్పంచ్ బోడ శ్రీను, నాయకులు ధీరావత్ వీరన్న,మామిండ్ల వెంకన్న,అరుణ్ నాయక్,జానీ,వీరన్న స్థానిక నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రాలకు ఫ్యాన్‌లు, కుర్చీల అందజేత




**కురవి ఏప్రిల్13(పి.సి.డబ్ల్యూ న్యూస్):** మండలంలోని ఎలుక చెట్ల తండా గ్రామపంచాయతీలో "పోషణ పక్షం" కార్యక్రమంలో భాగంగా గ్రామపంచాయతీ పరిధిలోని మేఘ్య తండా, మంచ తండా,భద్రూ తండ లలో ఉన్న అంగన్వాడీ కేంద్రాలకు ఫ్యాన్ లు,కుర్చీలను సోమవారం రోజున సర్పంచ్ మాలోత్ రమేష్ నాయక్ అందించడం జరిగింది. అంగన్వాడీ కేంద్రాల్లో ఉన్న పిల్లలకు కుర్చీలు,బాలింతలు కూర్చోవడానికి కుర్చీలు,ప్రతి అంగన్వాడీ కేంద్రానికి ఒక ఫ్యాన్ గ్రామ పంచాయతీ తరపున అందించడం జరిగింది. సిడిపిఓ లక్ష్మి,సూపర్ వైజర్ అనిత, వార్డు సభ్యులు నరేష్,కిషన్,శంకర్, కార్యదర్శి సురేష్, అంగ న్వాడీ టీచర్‌లు,ఆయాలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఏటూరునాగారం ఏజెన్సీలో అక్రమ నిర్మాణాల దందా

- అధికారులు మౌనం పై తీవ్ర విమర్శలు



**ఏటూరునాగారం: ఏప్రిల్ 13(పిసిడబ్ల్యూ న్యూస్):** ఏటూరునాగారం మండలంలోని ఏజెన్సీ ప్రాంతంలో అక్రమ నిర్మాణాలు విస్తృతంగా జరుగుతున్నాయన్న ఆరోపణలు స్థానికంగా తీవ్ర చర్చకు దారి తీస్తున్నాయి. గిరిజన హక్కులను పరిరక్షించాల్సిన సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. **అనుమతులు లేకుండా బహుళ అంతస్తుల నిర్మాణాలు** మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో గిరిజనేతరులు ఎలాంటి అనుమతులు లేకుండా బహుళ అంతస్తుల కమర్షియల్ భవనాలను నిర్మిస్తున్నప్పటికీ, గ్రామపంచాయతీ అధికారులు స్పందించకపోవడం అనుమానాలకు తావిస్తోంది.స్థానికుల ఆరోపణల ప్రకారం, కొంతమంది అధికారులు ముడుపులు స్వీకరించి ఈ నిర్మాణాలకు సహకరిస్తున్నారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. **1/70 చట్టం ఉల్లంఘనపై ఆందోళన** షెడ్యూల్ ప్రాంతాలకు వర్తించే 1/70 చట్టం ప్రకారం గిరిజన భూములను గిరిజనేతరులకు బదిలీ చేయడం నిషేధం. అయితే ఈ నిబంధనలను పూర్తిగా విస్మరించి నిర్మాణాలు కొనసాగుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ పరిస్థితి గిరిజన హక్కుల పరిరక్షణపై ప్రశ్నార్థకంగా మారింది. **అధికారుల నిర్లక్ష్యంపై ప్రశ్నలు** అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాల్సిన గ్రామపంచాయతీ, ఎమ్మార్వో తదితర సంబంధిత అధికారులు భవనాలు పూర్తయ్యే వరకు ఎందుకు మౌనం వహిస్తున్నారన్న ప్రశ్నలు ప్రజల్లో తీవ్ర అసంతృప్తిని కలిగిస్తున్నాయి.

# 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో అందరూ కట్టుబడి ఉండాలి

**- గ్రామ సర్పంచి గ్రామస్తులతో రహదారుల రక్షణపై కమిటీ నీఏర్పాటుచేసిన తొర్రూర్ ఏఎస్ఐ**

**- రహదారుల కమిటీ అధ్యక్షురాలుగా ఎంపికైన గ్రామ సర్పంచ్ విసంపల్లి కవిత బాలకృష్ణ**





**తొర్రూరు ప్రతినిధి, ఏప్రిల్ 13(పీసీడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 99 రోజుల ప్రజాప్రాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా రాష్ట్రంలోని అన్ని గ్రామపంచాయతీలో రోడ్డు భద్రత కమిటీలను ఏర్పాటు చేసి గ్రామంలోని ప్రతి ఒక్కరికి ప్రతి విషయంపై అవగాహన కల్పిస్తున్నారు. అందులో భాగంగా జిల్లా ఎస్పీ శబరిష్ ప్రధాన గ్రామపంచాయతీలలో అవగాహన సదస్సులను ఏర్పాటు చేసి గంజాయి రహిత గ్రామాలుగా అలాగే తలకు రక్షణగా హెల్మెట్ ధరించే విధంగా చూసేందుకు గ్రామ సర్పంచులకు బాధ్యతలు అప్పగిస్తున్నారు. ఇందులో భాగంగానే మహబూబాబాద్ జిల్లా , తొర్రూరు మండలంలోని గుర్తుర్ గ్రామపంచాయతీలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా రహదారుల రక్షణ కమిటీ అధ్యక్షురాలుగా గ్రామ సర్పంచ్ విసంపల్లి కవితా బాలకృష్ణ ను ఎంపిక చేశారు చేశారు. ఈ కార్యక్రమానికి తొరూర్ పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ హాజరయ్యారు. సర్పంచ్ తో పాటు గ్రామస్తులు పాల్గొన్న ఈ సమావేశంలో అందరితో అన్ని విధాలుగా రక్షణ సూత్రాలను పాటిస్తామని ప్రమాణ స్వీకారం చేయించారు. గంజాయి రహిత గ్రామంగా గ్రామం ఉండేలా చూస్తామని అన్నారు. అలాగే రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరూ ఇంటి నుండి తలకు హెల్మెట్లు ధరించి బయటికి వెళ్లాలని సూచించారు. దీనితోపాటు ద్విచక్ర వాహనదారులు మైనర్ బాల, బాలికలకు వాహనాలు ఇవ్వకూడదని పేర్కొన్నారు. మైనర్లకు ఏదైనా అనుకోని ప్రమాదం జరిగి ఉంటే నష్టపోయేది తల్లిదండ్రులని దృష్టిలో పెట్టుకొని చిన్నారులకు వాహనాలు ఇవ్వకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎవరికైనా ప్రమాదం జరిగినప్పుడు ఆలస్యం చేయకుండా వెంటనే 108 అంబులెన్స్ కు సమాచారం ఇచ్చి వారి ప్రాణాలను కాపాడే విధంగా చూడాలని అన్నారు. మనకు తెలిసిన వారు అయినా కాకుండా ప్రమాదాలు జరిగినప్పుడు మనకెందుకులే అనుకోకుండా తోటి వారి ప్రాణాలు కాపాడేలా చూడాలని పేర్కొన్నారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం లో గ్రామ కార్యదర్శి రబ్బాని తోపాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఈ గ్రామాల్లో ప్రజా దర్బార్' కార్యక్రమం

**.నేడు మంగళవారం రాయని గూడెం, సర్వాపురం, రేపు రాజుపేట, మల్లూరు గ్రామాల్లో 'ప్రజా దర్బార్' కార్యక్రమం: జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.**

**ములుగు ప్రతినిధి ఏప్రిల్ 13(పిసిడబ్ల్యూ న్యూస్):** ములుగు మండలం రాయని గూడెం గ్రామపంచాయతీ కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు, సర్వాపురం మండల పరిషత్ ప్రైమరీ స్కూల్ సాయంత్రం 6 గంటలకు, మంగపేట మండలం రాజుపేట గ్రామంలో జిల్లా పరిషత్ హైస్కూల్ లో బుధవారం మధ్యాహ్నం మూడు గంటలకు, మల్లూరు గ్రామపంచాయతీ కార్యాలయంలో సాయంత్రం 6 గంటలకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క ఆధ్వర్యం లో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. సోమవారం ప్రకటన లో తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నేరుగా ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కార మార్గం చూపడానికి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క సమక్షంలో ములుగు మండలంలోని రాయినిగూడెం సర్వపూర్, మంగపేట మండలం రాజుపేట మల్లూరు గ్రామాలలో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని, నాలుగు గ్రామాలకు చెందిన ఫిర్యాదుదారులు తమ స్థానిక సమస్యలు, ప్రభుత్వ పథకాలకు సంబంధించిన విన్నపాలను ఈ సందర్భంగా అధికారుల దృష్టికి తీసుకురావచ్చని ఆయన తెలిపారు.ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, తమ సమస్యలపై దరఖాస్తులను అందజేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ కోరారు.ప్రజా దర్బార్ కార్యక్రమానికి వచ్చే అర్జీదారులకు అన్ని మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.జిల్లా ఎస్ పి, డి ఎఫ్ ఓ, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు, ఆర్డీఓ అన్ని శాఖల జిల్లా అధికారులు, అన్ని శాఖ ల



ఇంజనీరింగ్ ఉన్నత అధికారులు, సంబంధత మండలాల తహసిల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీ ఓలు తప్పనిసరిగా హాజరు కావాలని ప్రకటనలో జిల్లా కలెక్టర్ తెలియజేసారు

# రహదారి భద్రత పాటిస్తేనే సురక్షిత ప్రయాణం

**● రహదారి భద్రతపై అవగాహన కల్పించాలి: జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.**

**ములుగు ప్రతినిధి ఏప్రిల్ 13(పిసిడబ్ల్యూ న్యూస్):** రహదారి భద్రత పాటిస్తేనే సురక్షిత ప్రయాణం అని, రహదారి భద్రతపై విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్. అన్నారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమశీ అర్రైవ్ అలైవ్ వారోత్సవాల్లో భాగంలో సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో రవాణా శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన 'జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు – 2026' పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. పోస్టర్ లను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ రోజు 13నుండి వారం రోజుల పాటు 18 వ తేదీ వరకు అరైవ్ అలైవ్ కార్యక్రమాలను నిర్వహించనునట్లు తెలిపారు. "సీక్ సే సురక్ష – టెక్నాలజీ సావ పరివార్తన్ " నేర్చుకోవడంతో రక్షణ – సాంకేతికతతో మార్పు అనే నినాదంతో ఈ ఏడాది అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. "బీ ఏ రోడ్ సేఫ్టీ ఛాంపియన్ అంటూ




పిలుపునిస్తూ, జిల్లాలోని వాహనదారులు, విద్యార్థులు, ప్రజలందరూ రహదారి నిబంధనలు పాటించి సురక్షిత ప్రయాణాన్ని సాగించాలని కలెక్టర్ సూచించారు. ప్రపంచవ్యాప్తంగా రహదారి ప్రమాదాల్లో భారత్ అగ్రస్థానంలో ఉండటం అందరిని ఆందోళనకు గురి చేస్తున్న అంశమని గత ఏడాది గణాంకాల ప్రకారం దేశవ్యాప్తంగా సుమారు 4,80,000 ప్రమాదాలు జరగగా, అందులో దాదాపు 1,70,000 మంది ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. ఈ మరణాల వల్ల జీడీపీలో సుమారు 3.14% ఆర్థిక నష్టం వాటిల్లుతుందని, రహదారి ప్రమాదాలకు గురవుతున్న వారిలో 80 శాతం మంది 18 నుండి 60 ఏళ్ల మధ్య వయస్సు గలవారే. కుటుంబానికి ఆధారమైన వ్యక్తులు ప్రాణాలు కోల్పోవడం వల్ల అనేక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, దీనిని అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు.రహదారి ప్రమాదానికి గురైన వారిని కీలకమైన మొదటి గంటలో ఆసుపత్రికి చేర్చి ప్రాణాలు కాపాడే వ్యక్తులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం "రహ–వీర్" పథకాన్ని ప్రవేశపెట్టిందనిప్రాణాలు కాపాడిన వారికి 25,000 నగదు బహుమతి అందజేయబడుతుందని, సహాయం చేసిన వారిపై ఎలాంటి పోలీసు లేదా చట్టపరమైన విచారణలు చేపట్టడం ఉండదని తెలిపారు. ప్రతి ఒక్కరు ఆధునిక సాంకేతికతను వాడుకుంటూనే, ట్రాఫిక్ నిబంధనలను తూ.చ. తప్పకుండా పాటించాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, ఆర్డిఓ వెంకటేష్, జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ వినోద్, డిపిఓ వెంకయ్య, డిపిఆర్ఓ రఫిక్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఏటూరునాగారంలో ఇసుక అక్రమ రవాణా రెచ్చిపోతోంది!

**'ఇందిరమ్మ' పేరుతో దందా? అధికారుల అండ ఉందా అనే అనుమానాలు**

**రాత్రివేళ ట్రాక్టర్ల దందాతో గ్రామస్తులకు నిద్రలేకుండా ఇబ్బందులు**



**ఏటూరునాగారం: ఏప్రిల్ 13(పిసిడబ్ల్యూ న్యూస్):** ఏటూరు నాగారం గ్రామపంచాయతీ పరిధిలో ఇసుక అక్రమ రవాణా రోజురోజుకూ పెరుగుతూ స్థానిక ప్రజలను తీవ్రంగా ఇబ్బంది పెడుతోంది. "ఇందిరమ్మ" పేరును ముసుగుగా ఉపయోగిస్తూ కొందరు వ్యక్తులు అధికారుల అండతో రాత్రివేళల్లో భారీగా ఇసుక తరలిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామస్తుల సమాచారం ప్రకారం, ప్రతిరోజూ రాత్రి పది ట్రాక్టర్లకు పైగా ఇసుక రవాణా జరుగుతోంది. ఈ ట్రాక్టర్లు గ్రామ వీధుల్లో తిరగడంతో భారీ శబ్ద కాలుష్యం, దుమ్ము, రోడ్ల దెబ్బతినడం వంటి సమస్యలు పెరిగిపోయాయి. దీంతో ప్రజలకు నిద్రలేమి తీవ్ర సమస్యగా మారింది."రాత్రిళ్లు నిద్రపోవడం కూడా కష్టమవుతోంది. పిల్లలు, వృద్ధులు చాలా ఇబ్బంది పడుతున్నారు" అని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అధికారుల స్పందన ఎక్కడ? ఈ విషయంపై ఎమ్మార్వోను ఫోన్ ద్వారా సంప్రదించగా, "మేము చర్యలు తీసుకుంటాం, సీఐ గారికి సమాచారం ఇచ్చాం" అని స్పందించినట్లు సమాచారం. అయితే ఇప్పటివరకు ఎలాంటి కఠిన చర్యలు తీసుకోకపోవడం వల్ల అధికారులపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం ఎమ్మార్వోను మళ్లీ సంప్రదించినా స్పందన లభించకపోవడం గమనార్హం.ప్రభుత్వ పనులకు ఇసుక లేదుడ అక్రమాలకు ఓకే?ప్రభుత్వ బస్సు డిపో నిర్మాణం వంటి పనులకు ఇసుక అనుమతులు ఇవ్వడం లేదని, ఇతర ప్రభుత్వ అవసరాలకూ సరఫరా నిలిపివేస్తున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. అదే సమయంలో రాత్రిళ్లు అక్రమ రవాణా ఎలా జరుగుతోందని ప్రశ్నిస్తున్నారు."ఇందిరమ్మ" పేరుతో ముసుగు?కొంతమంది "ఇందిరమ్మ" పేరును ముసుగుగా ఉపయోగించి ఈ అక్రమ రవాణా కొనసాగిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంపై పూర్తి స్థాయి విచారణ జరపాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.గ్రామస్తుల డిమాండ్లుఅక్రమ ఇసుక రవాణాను వెంటనే అరికట్టాలిరాత్రివేళ ట్రాక్టర్ రవాణాను నిలిపివేయాలిబాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలిఅధికారుల పాత్రపై విచారణ జరపాలిచర్యలు లేకపోతే ఆందోళనలుతక్షణ చర్యలు తీసుకోకపోతే పెద్ద ఎత్తున నిరసనలు, రహదారి దిగ్బంధనలు చేపడతామని గ్రామస్తులు హెచ్చరిస్తున్నారు.

# పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలి

**• విద్యా కమిషన్ సిఫార్సులు ఏకపక్షమైనవి: టిపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పులిచింతల విష్ణువర్ధన్ రెడ్డి వెల్లడి**



**తొర్రూరు ప్రతినిధి ,ఏప్రిల్ 13(పిసిడబ్ల్యూ న్యూస్):** గొంతు చించుకొని విద్యార్థులకు విద్యాబోధన చేస్తున్న ఉపాధ్యాయులకే ఇన్ని కష్టాలా.రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులు అంటే ఎందుకు ఇంత చిన్నచూపు చూస్తుందో అర్థం కావడం లేదని రావాల్సిన పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించి ఆపదలో ఉన్న ఉపాధ్యాయులను ఆదుకోవాలని కోరుతున్నారుతెలంగాణా విద్యా కమీషన్ ప్రభుత్వానికి సమర్పించిన నివేదిక ఉపాధ్యాయుల మనోభావాలకు విరుద్ధశీ అని మరియు ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని టిపిటిఎఫ్ మహబూబాబాద్ జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి పులిచింతల విష్ణు వర్ధన్ రెడ్డి అన్నారు.దంతాలపల్లి మరియు నరసింహులపేట మండలాల సబ్ కమిటీ సమావేశంలో పులిచింతల విష్ణువర్ధన్ రెడ్డి గారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతం పై ఆలోచించక ఉపాధ్యాయుల వేతనాలపై విద్యా కమీషన్ మాట్లాడడం విడ్డూరం అన్నారు.గడిచిన రెండు సంవత్సరాలుగా ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయ ఉద్యోగుల పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశం లో టిపిటిఎఫ్ మండల బాధ్యులు టి రవీందర్, క్రాంతి కుమార్, చింతల సురేష్, గుప్తా, బొమ్మ శ్రీనివాస్, బొబ్బిలి వెంకన్న, మాదాసు రాములు, సంతోష్, యాకన్న పాల్గొన్నారు.

# ఆర్యవైశ్యుల ఐక్యతే అభివృద్ధికి మార్గం

**• పసుమర్తి చందర్ రావు పిలుపు**

**• అత్యవసర సమావేశంలో సామాజిక, రాజకీయ చైతన్యంపై దృష్టి**



**కల్లూరు, ఏప్రిల్ 13 (పిసిడబ్ల్యూ న్యూస్) :** హైదరాబాద్ కర్మాన్ఘాట్‌లోని లక్ష్మీ కన్వెన్షన్ హాల్లో తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అత్యవసర సమావేశం ఘనంగా నిర్వహించబడింది. ఈ సమావేశానికి రాష్ట్ర మహాసభ అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించారు. వివిధ జిల్లాల నుంచి ప్రముఖ నాయకులు, సభ్యులు హాజరై సంఘ అభివృద్ధిపై చర్చించారు.ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు పసుమర్తి చంద్రరావు మాట్లాడుతూ ఆర్యవైశ్యులందరూ రాజకీయంగా చైతన్యంతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సమాజ అభివృద్ధికి రాజకీయాల్లో చురుకైన పాత్ర ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు.పేద ఆర్యవైశ్య విద్యార్థులు ఎదుర్కొంటున్న విద్యా, ఆరోగ్య సమస్యలను గుర్తించి, వారికి ఆర్థిక సహాయం అందించేందుకు మహాసభ మరింత బలంగా ముందుకు రావాలని ఆకాంక్షించారు. గత రెండు సంవత్సరాల కాలంలో మహాసభ నిర్వహించిన సేవా కార్యక్రమాలను ఈ సందర్భంగా వివరించి సభ్యుల ప్రశంసలు పొందారు.ఈ సమావేశం ఆర్యవైశ్యుల ఐక్యత, సంక్షేమం కోసం కీలక నిర్ణయాలకు వేదికగా నిలిచింది.

# గ్యాస్ సరఫరాపై చైర్మన్ ఆకస్మిక తనిఖీ

**• ప్రజలకు నమ్మకం కల్పించిన మోహన్ నాయక్ • మధిర రోడ్డులో భారత్ గ్యాస్ ఏజెన్సీ పరిశీలన • మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్**



**కల్లూరు, ఏప్రిల్ 13 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కల్లూరు పట్టణము నందు మధిర రోడ్డులోని లక్ష్మీ భారత్ గ్యాస్ ఏజెన్సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇటీవల గ్యాస్ కొరత, అధిక ధరలపై వచ్చిన అనుమానాల నేపథ్యంలో ఆయన స్వయంగా ఏజెన్సీకి వెళ్లి పరిస్థితిని పరిశీలించడం విశేషం. ఈ సందర్భంగా గ్యాస్ కోసం వచ్చిన లబ్ధిదారులతో చైర్మన్ ధరావత్ మోహన్ నేరుగా మాట్లాడి గ్యాస్ సరఫరా సక్రమంగా జరుగుతోందా? ఎలాంటి అదనపు చార్జీలు వసూలు చేస్తున్నారా? అనే అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. లబ్ధిదారులు తమకు ఎటువంటి ఇబ్బందులు లేవని, గ్యాస్ సకాలంలో అందుతోందని తెలిపారు.తరువాత ఏజెన్సీ నిర్వాహకుడు రామారావుతో మాట్లాడిన చైర్మన్ ఇటీవల కొంత భయాందోళనల కారణంగా తాత్కాలికంగా అలజడి నెలకొన్నప్పటికీ ప్రస్తుతం సరఫరా సజావుగా కొనసాగుతోందని తెలుసుకున్నారు. ప్రతి వినియోగదారునికి గ్యాస్ అందుబాటులో ఉంచుతున్నామని నిర్వాహకుడు స్పష్టం చేశారు.ఈ సందర్భంగా చైర్మన్ మోహన్ నాయక్ మాట్లాడుతూ మధిర రోడ్డులోని భారత్ గ్యాస్ ఏజెన్సీ సేవలు సంతృప్తికరంగా ఉన్నాయని తెలిపారు. ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఎవరైనా సమస్యలు ఎదుర్కొంటే వెంటనే మున్సిపల్ కార్యాలయానికి తెలియజేయాలని సూచించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ శీలం కోటేశ్వరి కృష్ణారెడ్డి, యువ నాయకులు యాస శ్రీకాంత్, యువజన నాయకులు ధరావత్ రవికుమార్ లు పాల్గొన్నారు.

# జువేరియా ఫాతిమా ఘన విజయం: కాలేజ్ టాపర్‌గా నిలిచిన విద్యార్థిని



**కరీంనగర్,ఏప్రిల్13(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్‌కు చెందిన అడ్వకేట్ మహమ్మద్ అల్తాఫ్ అహ్మద్ కుమార్తె జువేరియా ఫాతిమా ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం బీపీసీ పరీక్షల్లో అద్భుత ప్రతిభ కనబరిచింది. హైదరాబాద్ బండ్లగూడలోని అక్బరుద్దీన్ ఓవైసీ జూనియర్ కాలేజీలో చదువుతున్న ఆమె, మొత్తం 440 మార్కుల్లో 429 మార్కులు సాధించి కాలేజ్ స్థాయిలో ప్రథమ స్థానం దక్కించుకుని టాపర్‌గా నిలిచింది.జువేరియా ఫాతిమా 97.5 శాతం మార్కులు సాధించడం ఆమె కృషి, పట్టుదల, విద్యాపై ఉన్న నిబద్ధతకు నిదర్శనంగా నిలిచింది. ఆమె విజయంతో కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు, స్నేహితుల్లో ఆనందం వెల్లివిరిసింది.భవిష్యత్తులో వైద్యురాలిగా అవతరించాలని లక్ష్యంగా పెట్టుకున్న జువేరియా ఫాతిమా, ఈ విజయం తనకు మరింత ప్రేరణనిచ్చిందని తెలిపింది. ఇది ఆమె ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసిన కీలక అడుగుగా భావిస్తున్నారు.ఈ సందర్భంగా ఆమె తాత హాఫిజ్ మహమ్మద్ బషీర్ అహ్మద్ (నాబినా హాఫిజ్‌గా ప్రసిద్ధి), నాన్నమ్మలు మరియు ఇతర బంధువులు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.అదేవిధంగా, ఎడ్యుకేటర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ (మాజీ పాఠశాల యాజమాన్యం) కూడా జువేరియా ఫాతిమా విజయంపై హర్షం వ్యక్తం చేస్తూ ఆమెకు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించింది.

# రైస్ మిల్లింగ్ పాలసీపై మిల్లర్ల గళం.. సవరణలు చేయాలని డిమాండ్

**2025-26 రబీ అగ్రిమెంట్ మిల్లర్లకు భారమని ఆవేదన**

**సహజ నష్టాలకు బాధ్యత మోపడం అన్యాయం బాదం ప్రవీణ్**



**ములుగు,ఏప్రిల్ 13(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'రైస్ కస్టమ్ మిల్లింగ్ పాలసీ 2025-26'లోని పలు నిబంధనలు రైస్ మిల్లర్లకు భారంగా మారుతున్నాయని ములుగు జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బాదం ప్రవీణ్ ఆవేదన వ్యక్తం చేశారు. మిల్లర్ల సమస్యల పరిష్కారం కోరుతూ సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాకు చెందిన మిల్లర్లతో కలిసి ఆర్డీవోకు వినతిపత్రాన్ని సమర్పించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం ప్రాంగణంలో మిల్లర్లతో కలిసి మీడియాతో మాట్లాడిన ఆయన, కొత్త పాలసీలో పారదర్శకత లోపించిందని విమర్శించారు. అధికారులకు అధిక అధికారాలు కట్టబెట్టేలా, మిల్లర్ల హక్కులను పరిమితం చేసే విధంగా నిబంధనలు ఉన్నాయని తెలిపారు.ప్రారంభ దశలోనే భారీగా బ్యాంక్ గ్యారెంటీలు, సెక్యూరిటీ డిపాజిట్లు విధించడం వల్ల చిన్న, మధ్య తరహా మిల్లర్లు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ధాన్యం నాణ్యతపై ప్రభుత్వ బాధ్యత లేకపోవడం, తేమ శాతం మరియు సహజ నష్టాలకు మిల్లర్లనే బాధ్యులను చేయడం అన్యాయమని అన్నారు.చిన్నపాటి పొరపాట్లకే ఎసెన్షియల్ కమోడిటీస్ యాక్ట్ (1955) కింద క్రిమినల్ కేసులు నమోదు చేసే నిబంధనను తొలగించాలని డిమాండ్ చేశారు. అలాగే 100 శాతం సిఎంఆర్ డెలివరీ నిబంధనను సవరించి, రవాణా మరియు నిల్వలో కలిగే నష్టాలకు తగిన వెసులుబాటు కల్పించాలని కోరారు.ప్రస్తుత పాలసీ మిల్లింగ్ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టే ప్రమాదం ఉందని, ప్రభుత్వం తక్షణమే స్పందించి సవరణలు చేయకపోతే మిల్లర్ల మనుగడ కష్టమవుతుందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జనరల్ సెక్రటరీ గురిజాల సహోదర్ రెడ్డి, ట్రెజరర్ యెలగందుల మోహన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కొమురవెల్లి హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత- ప్రతి ఒక్కరి బాధ్యత

**ఆర్టీసీ బస్సులలో ప్రయాణం సురక్షితం, సుఖమయం, శుభప్రదం**

**సత్తుపల్లి డిపో మేనేజర్ గురిజాల లక్ష్మీనారాయణ**

**సత్తుపల్లి ఆర్టీసీ ఆధ్వర్యంలో అరైవ్-ఎలైవ్ ప్రోగ్రాం**

**ఎం వి ఐ రాజశేఖర్, సబ్ ఇన్స్పెక్టర్ జి అశోక్**



**సత్తుపల్లి, ఏప్రిల్ 13 (పిసిడబ్ల్యూ న్యూస్) :** రోడ్డు భద్రత ప్రతి ఒక్కరు బాధ్యత అని, భద్రతా నియమాలు పాటిస్తూ ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా నడుచుకున్నట్లయితే ప్రమాదాలను నివారించవచ్చును అని సత్తుపల్లి డిపో మేనేజర్ గురిజాల లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం సత్తుపల్లి డిపోలో ఎరైవ్- ఎలైవ్ ప్రోగ్రాంను స్థానిక ఎంవిఐ రాజశేఖర్ , సబ్ ఇన్స్పెక్టర్ జి అశోక్ ఆధ్వర్యంలో నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడుతూ సురక్షిత ప్రయాణానికి ఆర్టీసీ బస్సులను మాత్రమే ఉపయోగించుకోవాలని ఆర్టీసీ బస్సులలో ప్రయాణం సురక్షితం సుఖమైన శుభప్రదం అని అన్నారు.ఆర్టీసీలోనే అనుభవజ్ఞులైన డ్రైవర్లు ఉంటారు అని సురక్షిత ప్రయాణానికి ఆర్టీసీ బస్సులను ఎంచుకోవాలి అని డిపో మేనేజర్ సూచించారు.ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రణాళికలో భాగంగా సోమవారం సత్తుపల్లి ఆర్టీసీ ఆధ్వర్యంలో అరైవ్-అలైవ్ క్యాంపెయిన్ లో భాగంగా ర్యాలీ ప్రదర్శన నిర్వహించారు. రోడ్డు ప్రమాదాలను నియంత్రించడం, ప్రజల్లో ట్రాఫిక్ నియమాలపై బాధ్యతాభావం పెంపొందించడం లక్ష్యంగా అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. వాహన దారుల నిర్లక్ష్యం వల్లనే రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని హెల్మెట్ , సీటు బెల్ట్ ధరిస్తే ప్రమాదాలను కొంతమేర నివారించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. మద్యం తాగి వాహనాలను నడప రాదని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ముందుగా సత్తుపల్లి డిపో నుండి ప్ల కార్డులు చేతబూని, రోడ్డు భద్రత స్లొగన్స్ చేస్తూ రింగ్ సెంటర్లో మానవహారం నిర్వహించారు. అనంతరం డిపో గేటు వద్ద ఉద్యోగులతో కలిసి రోడ్డు భద్రత నియమాలను పాటించాలని కోరుతూ ప్రతిజ్ఞ చేయించారు. ఎస్సై జి అశోక్, ఎంవీఐ రాజశేఖర్, ఏఎంవీఐ రాజశేఖర్ రెడ్డి, ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ ప్రవీణ్ కుమార్, అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీర్ ఎస్ సాహితి, ఏడీసీలు, సూపర్ వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# చొప్పదండి బాలికల మైనారిటీ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీలో ఇంటర్ ఫలితాల్లో అద్భుత విజయం



**చొప్పదండి,ఏప్రిల్13(పీసీడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ సొసైటీ ఆధ్వర్యంలో నడుస్తున్న చొప్పదండి బాలికల మైనారిటీ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీ ఇంటర్మీడియట్ పరీక్షల్లో శుభప్రదమైన ఫలితాలను నమోదు చేసింది. విద్యార్థినులు తమ కృషి, పట్టుదలతో పాటు ఉపాధ్యాయుల సమర్థ మార్గదర్శకత్వంతో విశేష ప్రతిభ కనబరిచారు.కళాశాల ప్రిన్సిపాల్ జి. వారుణి తెలిపిన వివరాల ప్రకారం, ఫస్ట్ ఇయర్‌లో 80 శాతం విద్యార్థినులు ఉత్తీర్ణత సాధించగా, సెకండ్ ఇయర్‌లో 97 శాతం మంది విజయాన్ని సాధించారు. దీంతో కళాశాల ప్రతిష్ట మరింత పెరిగింది.ఫస్ట్ ఇయర్‌లో కల్సూమ్ తన్వీర్ 500లో 469 మార్కులు సాధించి ప్రతిభ చాటుకోగా, సెకండ్ ఇయర్‌లో జాస్మిన్ 1000లో 965 మార్కులు సాధించి అగ్రస్థానంలో నిలిచింది. ఈ ఫలితాలు కళాశాల విద్యా ప్రమాణాలు, క్రమశిక్షణను ప్రతిబింబిస్తున్నాయి.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ విజయవంతమైన విద్యార్థినులకు అభినందనలు తెలియజేస్తూ, ఇది వారి కృషి, ఉపాధ్యాయుల నిబద్ధత ఫలితమని పేర్కొన్నారు. లెక్చరర్ల సేవలను కొనియాడుతూ వారి అంకితభావాన్ని ప్రశంసించారు.కళాశాల ఉపాధ్యాయులు కూడా విద్యార్థినులకు అభినందనలు తెలుపుతూ, వారి భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలని ఆకాంక్షించారు. మరింత కృషితో ఉన్నత విజయాలు సాధించాలని సూచించారు.ఇకపోతే, రాబోయే విద్యా సంవత్సరానికి 5వ, 6వ తరగతులు మరియు ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో ప్రవేశాలు ప్రారంభమైనట్లు కళాశాల యాజమాన్యం ప్రకటించింది. ఆసక్తి గల విద్యార్థినులు త్వరగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

# మీ విజయమే మా గర్వం

**- శ్రీ వైష్ణవి ఒకేషనల్ జూనియర్ కళాశాల చైర్మన్ మంత్రి పల్లి శ్రీనివాస్, అకాడమిక్ డైరెక్టర్ ఇనపనూరి పుల్లారావు**

**- శ్రీ వైష్ణవి ఒకేషనల్ జూనియర్ కాలేజీ విద్యార్థుల విజయగర్జన**

**- పట్టుదల, కృషి, గురువుల మార్గదర్శకత్వంతో ఇంటర్ ఫలితాల్లో అద్భుత విజయాలు**





**ఖమ్మం ప్రతినిధి, ఏప్రిల్ 13 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మీ విజయమే మా గర్వం అని శ్రీ వైష్ణవి ఒకేషనల్ జూనియర్ కళాశాల చైర్మన్ మంత్రి పల్లి శ్రీనివాస్, అకాడమిక్ డైరెక్టర్ ఇనపనూరి పుల్లారావు లు అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఆదివారం విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాలు శ్రీ వైష్ణవి ఒకేషనల్ జూనియర్ కళాశాలకు గర్వకారణంగా మారాయి. విద్యార్థుల కృషి, తల్లిదండ్రుల ఆశీస్సులు, గురువుల అంకితభావం కలిసి అద్భుత ఫలితాలను అందించాయి. ఈ విజయగాథ ప్రతి ఒక్కరినీ ప్రేరేపించేలా నిలిచింది. ఇంటర్ ప్రథమ సంవత్సరం ఫలితాల్లో ఎంపిహెచ్డబ్ల్యు (నర్సింగ్) విభాగానికి చెందిన కూజా కావ్యశ్రీ (హాల్ టికెట్ : 2643400497) 500లో 483 మార్కులు సాధించి ఖమ్మం డివిజన్‌లో ప్రథమ ర్యాంకును కైవసం చేసుకోవడం విశేషం. అదే విభాగంలో మందుల ప్రసన్న 478 మార్కులతో రెండో స్థానంలో నిలిచి కళాశాల ప్రతిష్ఠను మరింత పెంచింది. ల్యాబ్ టెక్నీషియన్ కోర్సుల్లో జి. ప్రకాష్ (హాల్ టికెట్: 2643400263) 436 మార్కులు, టీ. రాకేష్ 427 మార్కులు సాధించి వరుసగా మొదటి, రెండో స్థానాల్లో నిలిచి తమ ప్రతిభను చాటుకున్నారు.ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో కూడా ఈ కళాశాల విద్యార్థులు తమ ప్రతిభను కొనసాగించారు. భూక్య కీర్తన 1000లో 967 మార్కులు సాధించి జిల్లా స్థాయి ర్యాంకును సాధించగా, బొడ్డు సింధు 958 మార్కులతో రెండో స్థానంలో నిలిచింది. ల్యాబ్ టెక్నీషియన్ విభాగంలో కుర్రు జస్వంత్ 851 మార్కులు, బల్లి రాము 832 మార్కులతో మొదటి రెండు స్థానాలను దక్కించుకున్నారు. ఇక మొత్తం ఫలితాల్లో 20 మంది విద్యార్థులు 400కు పైగా మార్కులు సాధించడం ఈ కళాశాల విద్యా ప్రమాణాలను స్పష్టంగా తెలియజేస్తోంది. ఇది కేవలం మార్కుల విజయం మాత్రమే కాకుండా, ప్రతి విద్యార్థి కష్టానికి లభించిన గౌరవం.విజయాన్ని సంబరంగా మార్చుకుంటూ కళాశాల చైర్మన్ మంత్రి పల్లి శ్రీనివాస్, అకాడమిక్ డైరెక్టర్ ఇనపనూరి పుల్లారావు విద్యార్థులకు స్వయంగా మిఠాయిలు తినిపించి అభినందించారు. "మీ విజయమే మా గర్వం" అని పేర్కొంటూ విద్యార్థుల తల్లిదండ్రులను కూడా హృదయపూర్వకంగా అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ దొండేటి నరేష్ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు షీల్డ్‌లు అందజేసి వారి భవిష్యత్తు మరింత ఉన్నతంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ విజయోత్సవం కేవలం ఒక కళాశాల గర్వమే కాదుడ కష్టపడి చదివితే సాధ్యం కానిది ఏదీ లేదని చెప్పే సజీవ ఉదాహరణగా నిలిచింది. ఉపాధ్యాయులు రాజేష్, మధు, మనోజ్, శ్యామన్, నాగేంద్రమ్మ, నాగమణి, జోష్ణ, రత్నకుమారి, ఉమా, శ్రీదేవి తదితరులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొని ఆనందాన్ని పంచుకున్నారు.

# నాణ్యమైన పౌష్టిక ఆహారం అందించాలి

**సర్పంచ్ గుగులోతు ఉమారాణి**

**బత్తులపల్లిలో పోషణ పక్షం నిర్వహణ**

**తల్లులు, బాలికలకు అవగాహన**

**పౌష్టికాహారంపై గ్రామస్థులకు విస్తృత ప్రచారం**





**కల్లూరు, ఏప్రిల్ 13 (పిసిడబ్ల్యూ న్యూస్) :** గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ గుగులోతు ఉమారాణి ఆధ్వర్యంలో గ్రామ బాలల పరిరక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. అనంతరం పోషణ పక్షం కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులకు, ముఖ్యంగా తల్లులు, కిశోర బాలికలకు పౌష్టికాహారం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రంలో గర్భిణీకి సంప్రదాయబద్ధంగా సీమంతం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉమారాణి మాట్లాడుతూ చిన్నారులు, బాలింతలు ఆరోగ్యంగా ఉండేందుకు అంగన్వాడీ కేంద్రాల్లో నాణ్యమైన పౌష్టికాహారం అందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. తల్లిపాల ప్రాముఖ్యతను వివరించి, శిశు సంరక్షణలో తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అంగన్వాడీ సిబ్బంది సమయపాలన పాటిస్తూ, పోషకాహారం పంపిణీలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్ భవాని, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ సోషల్ వర్కర్ అన్నపూర్ణ, టీచర్లు శ్రీదేవి, అరుణ గాంధీ, రాధా, పంచాయతీ సెక్రటరీ, ఏఎన్ఎం, ఆశాలు, గర్భిణీలు, బాలింతలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# స్వయం ఉపాధికి ప్రోత్సాహం

- పిండి కారం మిల్లు ప్రారంభించిన చైర్మన్ మోహన్ నాయక్
- చిన్న పరిశ్రమలే ప్రజల అభివృద్ధికి దారి



**కల్లూరు, ఏప్రిల్ 13 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కల్లూరు మధిర రోడ్డులో భారత్ గ్యాస్ ఏజెన్సీ ఎదురుగా ఓం మహాదేవ్ పిండి కారం మిల్లును మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలు స్వయం ఉపాధి ద్వారా ఎదగడం తనకు ఎంతో ఆనందాన్ని ఇస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుతం చిన్న పరిశ్రమలు, స్వయం ఉపాధి రంగాలు లాభదాయకంగా మారుతున్నాయని, యువత ఈ అవకాశాలను వినియోగించుకుని ఆర్థికంగా బలపడాలని సూచించారు. ప్రభుత్వం కూడా స్వయం ఉపాధికి ప్రోత్సాహక కార్యక్రమాలు అందిస్తున్న నేపథ్యంలో ఇలాంటి వ్యాపారాలు మరింత అభివృద్ధి చెందుతాయని అన్నారు. మిల్లు యజమాని సత్యంకు శుభాకాంక్షలు తెలుపుతూ, ఆయన వ్యాపారం విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరగడం వల్ల ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కోటేశ్వరి కృష్ణారెడ్డి, కాంగ్రెస్ నాయకులు యాస శ్రీకాంత్, లక్కినేని నరేంద్రబాబు, ఉమామహేశ్వరి దంపతులు, ఎం. బసవయ్య తదితరులు పాల్గొన్నారు.

# హర్యాతండా పంచాయతీలో అభివృద్ధి పరుగులు

**ప్రజల మన్ననలు పొందుతున్న సర్పంచ్ స్వాతి, ఉపసర్పంచ్ శ్రీను నాయక్**





**రఘునాథపాలెం, ఏప్రిల్ 13 (పిసిడబ్ల్యూ న్యూస్):** హర్యాతండా గ్రామ పంచాయతీ పరిధిలో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయి. సర్పంచ్ స్వాతి, ఉపసర్పంచ్ శ్రీను నాయక్ సమర్థ నాయకత్వంలో గ్రామాభివృద్ధి దిశగా పలు కీలక చర్యలు తీసుకుంటూ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. సుఖీనితండా గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించే దిశగా వాటర్ ట్యాంక్‌ను పూర్తిగా శుభ్రపరచించి, జేసీపీ సహాయంతో పైపులైన్ పనులను వేగంగా పూర్తి చేశారు. దీంతో గ్రామస్తులకు స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులోకి తీసుకువచ్చారు. అలాగే జెగ్యాతండా గ్రామంలో కాలిపోయి పనికిరాని స్థితిలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను వెంటనే గుర్తించి మరమ్మతులు చేయించి, నిరంతర విద్యుత్ సరఫరా అందేలా చర్యలు చేపట్టారు. ఈ చర్యలతో గ్రామ ప్రజలకు పెద్ద ఎత్తున ఉపశమనం కలిగింది. గ్రామ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పంచాయతీ ముందుకు సాగుతుండగా, ఈ అభివృద్ధి కార్యక్రమాలపై స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. "ప్రజల సేవే మా ధ్యేయం గ్రామాభివృద్ధే మా లక్ష్యం" అనే నినాదంతో సర్పంచ్ స్వాతి, ఉపసర్పంచ్ శ్రీను నాయక్ కృషి కొనసాగుతుండడం అభినందనీయంగా నిలుస్తోంది.

# బండి ముత్తమ్మకు ఘన నివాళులు

- దశ దిన కర్మకు హాజరైన సత్తుపల్లి మాజీ శాసనసభ్యులు సండ్ర



**కల్లూరు, ఏప్రిల్ 13 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మండల పరిధిలోని రఘునాథ బంజర గ్రామానికి చెందిన బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు బండి నరసింహారావు మాతృమూర్తి బండి ముత్తమ్మ దశదిన కర్మ కు బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య హాజరై ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యంగా ఉండాలని వారికి మనోధైర్యాన్ని నింపారు. ముత్తమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని పలువురు ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి కట్టా అజయ్ బాబు, కల్లూరు మున్సిపాలిటీ 18 వార్డ్ కౌన్సిలర్ పెడకంటి రామకృష్ణ, ఏఎంసి మాజీ వైస్ చైర్మన్ కాటమనేని వెంకటేశ్వరరావు, పుసునూరు శ్రీనివాసరావు, కావటి నరసయ్య, మాజీ సర్పంచ్ కుక్క అంజన్ రావు, ఉప సర్పంచ్ చల్లగుండ్ల వెంకటేశ్వరరావు, ఖమ్మంపాటి లక్ష్మణరావు, వార్డు సభ్యులు పొనుగుమాటి శ్రీనివాసరావు, బలుసుపాటి జగ్గయ్య, కుక్క మారేశ్వరరావు, జానపాటి రామారావు, బంధువులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఓటు బ్యాంకు రాజకీయాలకే అంబేద్కర్‌ను పరిమితం చేశారు

- అంబేద్కర్ ఆశయ సాధన కోసం నిరంతరం కృషి చేద్దాం
- బిజెపి జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు



**ఖమ్మం, ప్రతినిధి ఏప్రిల్ 13 (పిసిడబ్ల్యూ న్యూస్):** గత పాలకులు బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ పేరును కేవలం తమ స్వార్థ రాజకీయాల కోసం, ఓటు బ్యాంకు కోణంలోనే వాడుకున్నారని భారతీయ జనతా పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు విమర్శించారు. సోమవారం ఖమ్మం నగరంలోని 58వ డివిజన్ రమణగుట్టలో మేకల నాగేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంబేద్కర్ జయంతి వారోత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి ముందు జ్యోతి ప్రజ్వలనచేసి, నివాళులర్పించిన అనంతరం ఆయన పార్టీ శ్రేణులను ఉద్దేశించి ప్రసంగించారు. కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే అంబేద్కర్‌కు సరైన గౌరవం దక్కిందని కోటేశ్వరరావు పేర్కొన్నారు. గతంలో అంబేద్కర్‌ను కేవలం కొన్ని వర్గాల నాయకుడిగానే చూపే ప్రయత్నం జరిగిందని, కానీ మోదీ ప్రభుత్వం ఆయనను దేశ రాజ్యాంగ సృష్టికర్తగా, అన్ని వర్గాల ప్రజల మహోన్నత వ్యక్తిగా ప్రపంచానికి చాటిచెప్పిందన్నారు. స్మృతి వనాల ఏర్పాటు, జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ప్రభుత్వం అధికారికంగా అంగరంగ వైభవంగా నిర్వహించడం వంటి చర్యల ద్వారా ఆయన గౌరవాన్ని ఇనుమడింపజేసిందని కొనియాడారు. అంబేద్కర్ వాస్తవ జీవిత చరిత్రను, ఆయన ఉన్నతమైన ఆలోచనలను భావి తరాలకు అందించడంలో బీజేపీ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని వివరించారు. ఓటు హక్కును కల్పించి, రాజ్యాంగబద్ధం చేయడం ద్వారా భారతీయులందరికీ తమ తలరాతను తామే రాసుకునే గొప్ప అవకాశాన్ని కల్పించిన మహనీయుడు అంబేద్కర్ అని ఆయన స్మరించుకున్నారు. అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్తూ, దేశాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. స్థానిక రమణగుట్ట ప్రాంతంలోని కమ్యూనిటీ హాల్ అభివృద్ధికి, మరిన్ని మౌలిక వసతుల కల్పనకు తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఖమ్మం నగర రెండో పట్టణ అధ్యక్షుడు ధన్యాకుల వెంకటనారాయణ, సీనియర్ నాయకులు మందడపు సుబ్బారావు, మేకల నాగేంద్ర, బోయల వెంకట్, నక్కల రవిగౌడ్, కందుల శ్రీకృష్ణ, రుద్ర గాని మాధవ్, బోయినపల్లి సురేష్, కందుల శ్రీకృష్ణ, నాగరాజు, భద్రం తదితరులు పాల్గొన్నారు.

# స్త్రీలు అన్ని రంగాల్లో ముందుండాలి... స్వీయ రక్షణను కలిగి ఉండాలి




**ఏపీ: అన్నమయ్య జిల్లా: పుంగనూరు: ఏప్రిల్ 13 (పీసీడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):** పుంగనూరు పట్టణం లోని శుభారామ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల ప్రిన్సిపల్ ణతీ.వీ. వెంకటేశులు సూచనల మేరకు వైస్ ప్రిన్సిపల్ టి రాజశేఖర్, ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ కోఆర్డినేటర్ షాహిదాబాను ఆధ్వర్యంలో స్త్రీ శక్తి- (నారీ శక్తి వందన్ అధినియం 2023 ) కార్యక్రమాన్ని నిర్వహించారు. వైస్ ప్రిన్సిపల్ మాట్లాడుతూ స్త్రీలకు 33.3% రిజర్వేషన్లను కల్పించారని, స్త్రీలకు కావలసినటువంటి సమానమైన హక్కులు, వారి పరిరక్షణ చట్టాలు గురించి విద్యార్థినీ, విద్యార్థులకు తెలియజేశారు. స్త్రీలు అన్ని రంగాలలో ముందు ఉండాలని, స్వీయ రక్షణను కలిగి ఉండాలని, స్వయం సాధికారతతో వర్ధిల్లాలని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థినీ విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వపు పోటీలను నిర్వహించి, నారీ శక్తి ప్రతిజ్ఞను చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఎ.అనిల్ కుమార్, ణతీ .ఎ. సోమరాజు, విజయశ్రీ, స్రవంతి, నిర్మల, శ్రావణి , శ్రీనివాసులు, రాంకుమార్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రాజ్యాంగం భారతదేశానికి దిక్సూచి...



- బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి...



**కరీంనగర్,ఏప్రిల్13(పీసీడబ్ల్యూ న్యూస్):** రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రూపకర్తగా రూపొందించిన రాజ్యాంగశీ దేశానికి దిక్సూచి అయిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. భారతరత్న డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ జయంతి 135 వఉత్సవాలను పురస్కరించుకొని బిజెపి రాష్ట్ర శాఖ ఇచ్చిన పిలుపుమేరకు కరీంనగర్లోని స్థానిక రేకుర్తి లో గల అంబేద్కర్ విగ్రహా శుద్ధి, పరిసర ప్రాంతాలను శుభ్రం చేసే కార్యక్రమాన్ని బిజెపి శ్రేణులు చేపట్టారు. అలాగే హుజురాబాద్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద దీపాలను వెలిగించారు. ఆయా కార్యక్రమాలకు బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. భారత దేశాన్ని లౌకిక, గణతంత్ర, ప్రజాస్వామిక రాజ్యాంగ తీర్చిదిద్దేందుకు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అనుసరించిన కార్యచరణ మహోన్నతమైనదన్నారు. ముఖ్యంగా ప్రతి దేశానికి దానికి చట్టాలను రూపొందించిన నాయకులు ఉంటారు కానీ ఆ చట్టాలకు ఎవరు అర్హులు అనే భావనకి రూపమిచ్చిన నాయకులు తక్కువ ఉంటారని, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అటువంటి నాయకుల్లో ఒకరిని అన్నారు. సాధారణమైన వ్యక్తిగత కష్టాలను ఎదురుకొని అంబేద్కర్ రాజ్యాంగానికి ప్రధాన రూపకర్త అయ్యారన్నారు. ముఖ్యంగా అంబేద్కర్ తన జీవితమంతా సమానత్వంతో కూడిన చట్టపరమైన, నైతిక నిర్మాణాన్ని నిర్మించడంలో గడిపారని తెలిపారు. అంబేద్కర్ దర్శనికత మూలంగానే రాజ్యాంగబద్ధంగా ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు బి సాధ్యమైందన్నారు. బాబా సాహెబ్ చూపిన మార్గం లోనే కేంద్రంలోని మోడీ ప్రభుత్వం నడుస్తుందన్నారు. ఆ దిశలోనేబిసబ్బండ వర్గాలకు అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుందన్నారు. ప్రతి సంవత్సరం ఏప్రిల్ 14 అంబేద్కర్ జయంతి వేడుకలు కేవలం ఒక స్మరణ పండుగ మాత్రమే కాదని, ఇది దేశానికి ఒక మైలురాయి లాంటిదన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్స్ సోమిడి వేణు ప్రసాద్ బండ రమణ రెడ్డి ఒంటెల సత్యనారాయణ రెడ్డి పెద్దపల్లి జితేందర్ కర్రే అనిల్ జాడి బాలారెడ్డి శ్రీనివాస్ రెడ్డి లతో పాటు హుజురాబాద్ లో జరిగిన కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు తూర్పాటి రాజు, స్థానిక నేతలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీజాతీయ అధ్యక్షుడు మల్లికార్జున కార్గే పై చర్యలు తీసుకోవాలి: బీజేపీ రాజంపేట పార్లమెంట్ ఉపాధ్యక్షుడు అయూబ్ అలీ ఖాన్ ఫిర్యాదు.



**ఏపీ: అన్నమయ్య జిల్లా: పుంగనూరు: ఏప్రిల్ 13: (పీసీడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):** పుంగనూరు: కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే బీజేపీ ఆర్ఎస్ నాయకుల పై రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేయడం పట్ల బిజెపి నాయకులు మండిపడ్డారు. ఆయన పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీస్ స్టేషన్ నందు సిఐ. సుబ్బరాయుడు ఫిర్యాదు చేశారు. ఖర్గే మతపరమైన అంశాలను ప్రస్తావిస్తూ, విద్వేషాలు రేకెత్తించడమే కాకుండా శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ఉందని వెంటనే కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు పై చర్యలు తీసుకోవాలని అయుబ్ అలీ ఖాన్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి చిత్తూరు జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులు నరసింహులు , నానాబాల కుమార్, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

# వెంకట్ రెడ్డి నగర్ అసోసియేషన్ ఎన్నికలపై కాలనీవాసుల డిమాండ్

**● పదేళ్లుగా ఎన్నికలే లేవు ● అసోసియేషన్‌పై ఆగ్రహం ● రాజకీయాలకు చెక్ ● అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించాలి ● బైలా ఉల్లంఘనపై ప్రశ్నలు ● ప్రజాస్వామ్యమా? రాచరికమా? కాలనీవాసుల ప్రశ్నలు**

**● అసోసియేషన్ ఎన్నికలపై ఉద్రిక్తత.. షెడ్యూల్ ప్రకటించాలి**

**ఉప్పల్ ఏప్రిల్ 13(పిసిడబ్ల్యూ న్యూస్):** వెంకట్ రెడ్డి నగర్ డెవలప్మెంట్ అసోసియేషన్‌కు తక్షణమే ఎన్నికలు నిర్వహించాలని కాలనీవాసులు బలంగా డిమాండ్ చేస్తున్నారు. గత పదేళ్లకు పైగా ఎన్నికలు జరగకపోవడంతో కాలనీ అభివృద్ధి నిలిచిపోయిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.అసోసియేషన్ పదవుల్లో రాజకీయ నాయకుల ప్రభావం పెరగడం వల్ల అభివృద్ధి కార్యక్రమాలు నిర్లక్ష్యానికి గురయ్యాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. కాబట్టి, రాబోయే ఎన్నికల్లో రాజకీయాలకు అతీతంగా ఉన్న వ్యక్తులు మాత్రమే పోటీ చేయాలని, రాజకీయాల్లో చురుకుగా ఉన్న వారు అసోసియేషన్ ఎన్నికల్లో పాల్గొనకూడదని వారు స్పష్టం చేశారు.బైలా ప్రకారం ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా, ప్రస్తుత కమిటీ ఆ ప్రక్రియను అమలు చేయలేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుత అధ్యక్షుడు ఎన్నికల నిర్వహణపై స్పష్టత ఇవ్వకుండా, ఎన్నికలు అవసరం లేదన్న విధంగా స్పందించడం కాలనీవాసుల్లో అసంతృప్తిని రేకెత్తిస్తోంది.ఇది ప్రజాస్వామ్య పరిపాలనా వ్యవస్థా? లేక రాచరిక పాలనా విధానమా? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. తక్షణమే ఎన్నికల షెడ్యూల్ ప్రకటించి, పారదర్శకంగా పోలింగ్ నిర్వహించాలని వారు కోరుతున్నారు. లేనిపక్షంలో చట్టపరమైన మార్గాలను అనుసరించి ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# బిల్డర్స్ అసోసియేషన్ పేరుతో జోరుగా అక్రమ నిర్మాణాలు

**● ప్రభుత్వ చట్టాలను ఉల్లంఘిస్తూ నిర్మాణాలు**

**● ఆర్థిక బలంతో అధికారులను తప్పుదోవ పట్టిస్తున్న బిల్డర్లు ● బిల్డర్లు తీసుకున్న అనుమతులు ఎంత.? నిర్మాణాలు ఎంత.? వాస్తవాలు బహిర్గతం చేయాలి ● ప్రభుత్వ ఆదాయానికి కోట్లలో గండి కొడుతున్న బిల్డర్లపై చర్యలేవి.? ● ఫిర్యాదు చేసిన పత్రికలో కథనాలు వచ్చిన బెదిరింపులకు దిగుతున్న బిల్డర్లు ● బిల్డర్లు చేసే అక్రమ నిర్మాణాలపై పూర్తిస్థాయిలో విచారణ చేయించాలి ● సికింద్రాబాద్ జోన్ డీసీపీకి దళిత చైతన్య సంఘం పిర్యాదు**



**సికింద్రాబాద్ ఏప్రిల్ 13(పిసిడబ్ల్యూ న్యూస్):** మున్సిపల్ చట్టాలను ఉల్లంఘిస్తూ, ప్రభుత్వ అధికారులను తప్పుదోవ పట్టిస్తున్న బిల్డర్లపై(భవన నిర్మాణదారులపై)కట్టిన చర్యలు తీసుకోవాలని సికింద్రాబాద్ జోన్ డీసీపీ రక్షితమూర్తికి దళిత చైతన్య సంఘం కోరింది.ఈ మేరకు దళిత చైతన్య సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ముప్పిడి నవీన్ కుమార్ మాదిగ సోమవారం వారి బృందం మధుసూదన్,బాలకృష్ణలతో డీసీపీని కలిసి లిఖిత పూర్వకంగా పిర్యాదు చేశారు.సికింద్రాబాద్ బిల్డర్స్ అసోసియేషన్ అని పెట్టుకుని జిహెచ్ఎంసి నిబంధనలు అసలు పాటించకుండా ఇష్టానుసారంగా భవన నిర్మాణాలు చేస్తున్నారని, వీళ్లు చేసే నిర్మాణాలు అక్రమం అని సంబంధిత జిహెచ్ఎంసి అధికారులకు ఎవరైనా ఫిర్యాదు చేసిన పత్రికలో కథనాలు రాసిన వారిని బెదిరిస్తున్నారని డీసీపీకి వివరించారు. సికింద్రాబాద్ బిల్డర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్యామ్ సుందర్ అనే వ్యక్తి ఆర్ట్స్ కాలేజ్ రైల్వే స్టేషన్ సమీపంలోని రైల్వే ట్రాక్ కు ఆనుకుని భారీ అక్రమ నిర్మాణమును నిర్మించాడు. జిహెచ్ఎంసి నుండి జీ ప్లస్ టూ అనుమతి తీసుకుని జిహెచ్ఎంసి చట్టానికి వ్యతిరేకంగా భారీ సెల్లార్ తవ్వారు.అలాగే మూడు అంతస్తులు అక్రమంగా, అదనంగా నిర్మించాడు.ఈ అక్రమ భవనంపై స్థానికులు పలుమార్లు జిహెచ్ఎంసి అధికారులకు ఫిర్యాదు చేయగా జిహెచ్ఎంసి అధికారులు స్పందించి ఆ భవనానికి నోటీసులు ఇచ్చి మూడు సార్లు సీజ్ కూడా చేశారు.అయిన ఆ నిర్మాణదారుడు అదేమీ లెక్క చేయకుండా నిర్మాణాన్ని పూర్తిచేసి ఫంక్షన్ హాల్ నిర్మించాడు. ఈ భవనం అక్రమ నిర్మాణం అని తాను జిహెచ్ఎంసి కమిషనర్ కు, సికింద్రాబాద్ జోన్, జోనల్ కమిషనర్ కు ఫిర్యాదు చేయగా సదరు నిర్మారుడు ఆ విషయం తెలుసుకుని ఇతరులతో తనకు ఫోన్ చేపించారు. నేను అతనికి లొంగక పోవడంతో చేసేదేమీ లేక తనపై తప్పుడు ఆరోపణలు చేస్తూ జిహెచ్ఎంసి జోనల్ కార్యాలయంలో, సికింద్రాబాద్ జోన్ డిసిపి కి కూడా పిర్యాదు చేశారని ముప్పిడి తెలిపారు. ఇదే కాకుండా బిల్డర్స్ అసోసియేషన్ పేరుతో ఏర్పాటు చేసిన అసోసియేషన్ లో ఉన్న బిల్డర్లు అందరూ అక్రమ నిర్మాణాలు చేస్తూ ఎవరైనా ఫిర్యాదు చేసిన రిపోర్టర్లు పత్రికలలో కథనాలు రాసిన వాళ్లని బెదిరించడం, భయభ్రాంతులకు గురి చేయడం జరుగుతుందని వాళ్ల మాట వినకుంటే వాళ్లపై పగని పెంచుకొని అక్రమ కేసులు పెడుతున్నారని వివరించారు. బిల్డర్స్ అసోసియేషన్ లో ఉన్న సభ్యుల పూర్తి వివరాలు సేకరించి వాళ్లు తీసుకున్న అనుమతులు ప్రస్తుతం నిర్మాణాల పరిస్థితి పై పూర్తిగా ఎంక్వయిరీ చేసి తప్పుడు ఫిర్యాదు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిసిపిని కోరారు. వెంటనే స్పందించిన డిసిపి జిహెచ్ఎంసి అధికారుల నుండి భవన నిర్మాణ అనుమతుల నకలు తీసుకుని ప్రస్తుత వాటి నిర్మాణ పరిస్థితి తెలుసుకొని కావాలని తప్పుడు ఫిర్యాదు చేసిన వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని తమకు హామీ ఇచ్చారని నవీన్ కుమార్ మాదిగ తెలిపారు.

# అత్యవసర సమయంలో O+ రక్తదానం ప్రాణం కాపాడిన యువకుడు



**ములుగు జిల్లా, ఏప్రిల్ 13(పిసిడబ్ల్యూ న్యూస్):** ములుగు జిల్లా ఏటూరునాగారం ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగిన రక్తదానం సేవ ప్రతి ఒక్కరికి ఆదర్శంగా నిలిచింది. వాజేడు మండలం దూలాపురం గ్రామానికి చెందిన టి. తిరుపతమ్మ అనే గర్భిణీకి డెలివరీ సమయంలో అత్యవసరంగా O+ రక్తం అవసరమైంది.ఈ సమాచారం అందుకున్న ఏటూరునాగారం గ్రామానికి చెందిన బొగిరి బాలకృష్ణ వెంటనే స్పందించి ఆసుపత్రికి చేరుకుని రక్తదానం చేసి ఆమె ప్రాణాలను కాపాడారు. ఈ సేవతో ఆయన నిజమైన ప్రాణదాతగా నిలిచారు.ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ,"ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి. మనం ఇచ్చే కొద్దిపాటి రక్తం ఎవరికైనా కొత్త జీవితం ఇస్తుంది. ఒకరికి సహాయం చేస్తే వారు మరికొందరికి సాయం చేసేలా ప్రేరేపించాలి" అని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ టు సపోర్ట్ బ్లడ్ డోనర్స్ సభ్యులు ఆర్. రాజు, ఎం. సతీష్, సాగర్, గంగరాజు, 13వ వార్డు సభ్యుడు లక్ష్మీనారాయణతో పాటు ఆసుపత్రి సిబ్బంది మురళి తదితరులు పాల్గొన్నారు.ఆసుపత్రిలో రక్తదానం చేస్తున్న బాలకృష్ణతో పాటు ఆయనకు మద్దతుగా నిలిచిన యువకులు కనిపిస్తున్నారు. రక్తదానం మహాదానం మీ చిన్న సహాయం ఒకరి ప్రాణాన్ని కాపాడగలదు.అందరూ ముందుకు వచ్చి రక్తదానం చేయండి.. ప్రాణదాతలుగా నిలుద్దాం!

# దశాబ్దాల నిరీక్షణ కు విముక్తి కల్పించి, మహిళలకు పట్టంకట్టి పట్టాభిషేకం చేస్తుంది మోదీ ప్రభుత్వం...

**- మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ లు చారిత్రక నిర్ణయం.**

**- బిజెపి మహిళా మోర్చా అధ్యక్షురాలు చొప్పరి జయశ్రీ**



**కరీంనగర్,ఏప్రిల్13(పీసీడబ్ల్యూ న్యూస్):** భారత దేశ రాజకీయాలలో మహిళా భాగా,స్వామ్యాన్ని పెంచే మహత్తర సంస్కరణకు సమయం ఆసన్నమైందని, దశాబ్దాల నిరీక్షణకు విముక్తి కల్పిస్తూ మహిళలకు పట్టం కట్టి పట్టాభిషేకం చేసే కార్యక్రమానికి కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని బిజెపి మహిళా మోర్చా అధ్యక్షురాలు , కార్పొరేటర్ చొప్పరి జయ శ్రీ అన్నారు. సోమవారం కరీంనగర్ లోని పార్లమెంట్ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో చొప్పరి జై శ్రీ మాట్లాడారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే నారి శక్తి వందన్ అధి నియం బిల్లును ఏప్రిల్ 16న పార్లమెంటు ప్రత్యేక సమావేశంలో ప్రవేశపెట్టడం హర్షనీయమన్నారు. మహిళలకు 33 శాతం చట్టసభల్లో రాజకీయ ప్రాతినిధ్యం కల్పిస్తూ మోడీ ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందన్నారు.గత కాంగ్రెస్ పార్టీ మహిళలను రాజకీయ అవసరాలకే వాడుకుందని, మహిళలకు కాంగ్రెస్ రాజకీయంగా ప్రాతినిధ్యం కల్పించడానికి ఏ నాడు ఆలోచన చేసిన పాపాన పోలేదన్నారు. దశాబ్దాలు దేశాన్ని ఏలిన కాంగ్రెస్ మహిళలకు చట్టసభల్లో హక్కులు కల్పించలేక పోయిందని , భారతీయ జనతా పార్టీ ప్రభుత్వంమాత్రం మహిళలకు 33 శాతం రిజర్వేషన్లకు శ్రీకారం చుట్టి ఒక నూతన ఒరవడికి మార్గం చూపిందన్నారు. దీంతో మహిళలు నిర్ణయాత్మక శక్తిగా మారే అవకాశం ఉందని తెలిపారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం మహిళల సంక్షేమం అభివృద్ధి కోసం ఎంతో చిత్తశుద్ధి తో పనిచేస్తుందన్నారు. దేశాభివృద్ధిలో మహిళల భాగస్వామ్యం కూడా కీలకంగా మారిందని , ఆదిశ లోనే మోడీ సర్కార్ దశాబ్ద కాలాలుగా మహిళలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు పరిష్కారం చూపుతుందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని , చేతల ప్రభుత్వమని విశ్వాసం మహిళల్లోకి బలంగా వెళ్ళిందన్నారు. 2029 ఎన్నికలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలనే లక్ష్యంతో, భారీ ఎత్తున చట్టసభలలో అవకాశం కల్పించాలనే సంకల్పంతో బిజెపి ప్రభుత్వం ముందు కొనసాగుతుందన్నారు.

# ఏజెన్సీ సమస్యలపై తుడుందెబ్బ ముట్టడి ఆదివాసీల డిమాండ్లు వెల్లువ



**ములుగు జిల్లా, ఏప్రిల్ 13(పిసిడబ్ల్యూ న్యూస్):** ఈరోజు ఆదివాసి హక్కుల పోరాట సమితి "తుడుందెబ్బ" ఆధ్వర్యంలో ఏజెన్సీ ప్రాంత సమస్యల పరిష్కారం కోసం ముట్టడి కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించబడ్డాయి. వివిధ ప్రాంతాల నుండి భారీ సంఖ్యలో ఆదివాసీలు పాల్గొని తమ సమస్యలను గళమెత్తి వినిపించారు.ఈ సందర్భంగా నాయకులు ప్రధానంగా చేసిన డిమాండ్లు:దేశంలో జరుగుతున్న జనగణనలో ఆదివాసీలకు ప్రత్యేక రిలీజియన్ కాలమ్ ఏర్పాటు చేయాలి.కోయ భాషను 8వ షెడ్యూల్లో చేర్చాలి.ఏజెన్సీ ప్రాంతంలో యూరియా పంపిణీ యాప్ ద్వారా కాకుండా సాధారణ పద్ధతిలో అందించాలి.పోడు భూములు సాగు చేస్తున్న ప్రతి ఆదివాసికి హక్కు పత్రాలు మంజూరు చేయాలి.గతంలో సర్వే చేసిన 8 లక్షల ఎకరాలతో పాటు కొత్తగా సర్వే నిర్వహించి భూమి హక్కులు ఇవ్వాలి.సాదాబైనామా జీఓ నం.76 వల్ల ఏజెన్సీ చట్టాలకు భంగం కలుగుతుందని, 5వ షెడ్యూల్ ప్రాంతాలకు మినహాయింపు ఇవ్వాలి.కొత్త నియోజకవర్గాల ఏర్పాటులో భాగంగా ఏజెన్సీ ప్రాంతంలో 80 వేల నుంచి 1 లక్ష ఓటర్లతో నియోజకవర్గాలు ఏర్పాటు చేయాలి.ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులను నియమించాలి.గిరిజన వసతి గృహాల్లో విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించాలి. ఈ అన్ని సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఐటిడిఎ ముట్టడి కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కబ్బాక శ్రావణ్ కుమార్, రాష్ట్ర కార్యదర్శులు చింత కృష్ణ, వట్టం జనార్ధన్, మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొమరం లక్ష్మీకాంత, రాష్ట్ర కార్యదర్శి చర్ప లలిత, జిల్లా అధ్యక్షుడు చందా మహేష్, కార్యదర్శి కాపుల సమ్మయ్యతో పాటు వట్టం సురేష్, పొడెం నరసింహారావు, మండల అధ్యక్షులు తొర్రెం సంతోష్, చాప లక్ష్మణ్, ఆలం రాంబాబు, కోరం సుధాకర్, బోదెబోయిన రవి వర్మ, అన్నవరం హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.సారాంశం:ఆదివాసీల హక్కులు, జీవనోపాధి, భాషా పరిరక్షణ కోసం తుడుందెబ్బ చేపట్టిన ఈ ముట్టడి కార్యక్రమం ఏజెన్సీ ప్రాంతంలో చర్చనీయాంశంగా మారింది

# ప్రమాదాల నివారణ మనందరి కర్తవ్యం కావాలి

**● "అరైవ్ ..అలైవ్" లో ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి**







**తిమ్మాపూర్,ఏప్రిల్13(పీసీడబ్ల్యూ న్యూస్):** రోడ్డు ప్రమాదాల నివారణ మనందరి కర్తవ్యం కావాలని మానకొండూర్ ఎమ్మెల్యే ,టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన– ప్రగతి కార్యాచరణ లో భాగంగా తిమ్మాపూర్ మండలం రామకృష్ణకాలనీలో సోమవారం నిర్వహించిన అరైవ్–అలైవ్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజురోజుకు పెచ్చుమీరకుండా రోడ్డు ప్రమాదాలను నివారించాల్సిన బాధ్యతమనందరిపై ఉందన్నారు. రోడ్డు ప్రమాదాల వల్ల ఎన్నో కుటుంబాలు రోడ్డున పడిన ఉదంతాలు అనేకం ఉన్నాయని, ఇందుకు రామకృష్ణ కాలనీకి చెందిన చెన్నాడి చెంద్రారెడ్డి కుటుంబమే ఉదాహరణగా ఆయన చెప్పుకొచ్చారు. చిన్ని నిర్లక్ష్యమే పెద్ద ప్రమాదాలకు కారణమవుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రోడ్డు భద్రతపై తగిన చర్యలను చేపడుతున్నప్పటికీ రోడ్డు ప్రమాదాల సంఖ్య పెరుగుతూనే ఉన్నాయని, వాహనాల సంఖ్య పెరగడం, అతి వేగం, డ్రైవింగ్ లో నిర్లక్ష్యం,మందుతాగి వాహనాలు నడపడాలు రోడ్డ ప్రమాదాలకు కారణమవుతున్నాయన్నారు.ముఖ్యంగా డ్రైవింగ్ లైసెన్స్ లేని పిల్లలకు కూడా తల్లిదండ్రులు వాహనాలు ఇచ్చి ప్రమాదాలకు కారకులు కావడం బాధాకరమని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికైనా తల్లిదండ్రులు మేల్కొని డ్రైవింగ్ లైసెన్స్ లేనిదే పిల్లలకు బైక్ లు ఇవ్వవద్దన్నారు. జాతీయ రహదారిలో ఉన్న రామకృష్ణ కాలనీ నుంచి నిత్యం తాను నియోజవర్గ పర్యటనలు వెళుతుంటానని, పలు ప్రమాదాలను తాను స్వయంగా చూసిన ఉదంతాలు ఉన్నాయన్నారు. రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్న వారిపై మరింత కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ రోడ్డు భద్రతకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తున్నదన్నారు. నిర్లక్ష్యంగా వాహనాలను నడపడం వల్లనే అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని, ఈ ప్రమాదాల కారణంగా ఎన్నో కుటుంబాలు తమ వారిని పోగొట్టుకొని అనుభవిస్తున్న క్షోభ, వారి వేదనలు విన్నప్పుడల్లా హృదయం ద్రవిస్తుందన్నారు. చిన్నపాటి నిర్లక్ష్యం, అజాగ్రత్తలు పెద్ద ప్రమాదాలకు కారణమవుతున్నాయన్నారు. ప్రమాదాల నివారణే కోసమే ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలకు,వాహనదారులకు విస్తృత అవగాహన కల్పిస్తామన్నారు. అంతేకాకుండా అన్ని విభాగాల అధికారులను సమన్వయ పరుస్తామన్నారు. ప్రమాదాల నివారణ చర్యలు మరింత కట్టుదిట్టం చేస్తామన్నారు.కరీంనగర పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారించే విషయంలో ప్రజలకు విస్తృతస్థాయిలో అవగాహన కల్పిస్తున్నామన్నారు. జాతీయ రహదారులపై ప్రమాదాలు ఎక్కువ జరుగుతున్నాయన్నారు. బైకులపై ట్రిపుల్ రైడింగ్ చేయడం, హెల్మెట్ ధరించపోవడం కారణంగా మరణాలు సంభవిస్తున్నాయన్నారు. రోడ్డు ప్రమాదాలను నివారించే విషయంలో జాతీయ రహదారిలో ఉన్న గ్రామాల ప్రజలను జాగృతపరుస్తున్నామన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు సహాయ చర్యల్లో ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. కళ్ల ముందే ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోకపోవడం అన్యాయమని, ఘటన జరిగినప్పుడు అక్కడే ఉన్న వ్యక్తులు సెల్ ఫోన్లలో ఫొటోలు, వీడియోలు తీస్తుంటారే తప్ప క్షతగాత్రులకు సాయపడకపోవడం అమానవీయమని ఆయన పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల గురించి సమాచారం ఇచ్చిన వారికిగాని, క్షతగాత్రులను ఆస్పత్రులకు తీసుకువెళ్లిన వారిపైగాని ఎలాంటి కేసులుండవని, పోలీసు స్టేషన్ చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదన్నారు. ఇప్పటికైనా అపోహను వీడి రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు అందుబాటులో ఉన్న వారు క్షతగాత్రులకు సహాయ చర్యల్లో పాల్గొనాలని సీపీ కోరారు. అనంతరం సీపీతో కలిసి ఎమ్మెల్యే పలువురు వాహన చోధకులకు హెల్మెట్లను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముందు గ్రామ చౌరస్తాలో ప్రమాద నివారణకు సంబంధించి భద్రతా నియమాలు పాటిస్తామంటూ గ్రామస్తులతో ప్రమాణం చేయించారు.ఈ కార్యక్రమాల్లో జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, రామకృష్ణ కాలనీ గ్రామ సర్పంచ్ గుజ్జ శ్వేత, తహసీల్దార్ కర్ర శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీవో మల్హోత్రా, తిమ్మాపూర్ సీఐ సదన్ కుమార్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎస్ ఎల్ గౌడ్, తిమ్మాపూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి రమేశ్,మాజీ అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి, పార్టీ నాయకులు తుమ్మనపల్లి శ్రీనివాసరావు, శ్రీగిరి రంగారావు, నుస్తులాపూర్ సర్పంచ్ తుమ్మనపల్లి సంధ్య, పోరండ్ల సర్పంచ్ అసోద శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ వెళ్లే వారికి రానున్న రోజుల్లో జిల్లా బస్సుల నుండి లోకల్ బస్సులకు మారాల్సిందేనా ?.



**- ఉప్పల్ రింగ్ రోడ్‌లో బస్సులు ఆగే స్థలాన్ని ఎత్తివేత?.**

**- వంతెనల నిర్మాణం కోసం ట్రాఫిక్ అంతరాయాలు కలగకుండా తీసుకున్న నిర్ణయాలు అని విశ్వసనీయ సమాచారం.**

**- హనుమకొండ, తొర్రూర్, ఇతర డిపోల నుండి భువనగిరి వైపు వెళ్లే జిల్లా ఆర్టీసీ బస్సులకు నల్ల చెరువు వద్దనే బస్టాండ్ ఏర్పాటు?.**

**- ప్రస్తుతం ఇవన్నీ నిర్మాణ దశలో ఉన్నాయి, ఇంకా రెండు మూడు నెలలు పట్టే అవకాశం ఉందంటున్నారు అధికారులు?.**

**- ఆర్టీసీకి సంబంధించిన మరికొంత సమాచారాన్ని పరిశీలిద్దాం?.**







**తొర్రూరు ప్రతినిధి ,ఏప్రిల్ 13(పిసీడబ్ల్యూ న్యూస్):** హైదరాబాదు ఒక మహా పెద్ద నగరం. అన్ని రాష్ట్రాల వారు హైదరాబాద్ కు వచ్చి వెళ్తూనే ఉంటారు. విమాన మార్గం, రైలు మార్గం, బస్సు మార్గం ఎక్కడ నుండి వచ్చిన హైదరాబాద్ మాత్రం ఒక రద్దీ ప్రదేశమే. వందల సంవత్సరాల చరిత్ర గల హైదరాబాదు నగరానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఎన్నో చూడదగ్గ ప్రదేశాలు ఉన్నాయి. దేశ విదేశాల నుండి కూడా వచ్చే వారి సంఖ్య దినదినము పెరుగుతూనే ఉంది. విమానాశ్రయాలు, రైలు మార్గాలను పక్కన పెడితే మనకున్న బస్సు మార్గాలను వాటితో పెరుగుతున్న జనాభా సంఖ్య బస్సుల, సంఖ్య ఎలా ఉందో ఒకసారి పరిశీలిద్దాం?. రాష్ట్ర రాజధానిలో ఒకనాడు ఆర్టీసీ బస్సులు ఎర్ర బస్సులుగా అతికొద్ది శాతమే తిరుగుతుండేవి. నేడు అవి రకరకాల రంగులలో ఇప్పుడు హైదరాబాదుకు చేరుతున్నాయి. ఎటు చూసినా అంతు పట్టని జనం బస్సుల రద్దీ హైదరాబాదులోనికి రావాలంటే చాలీచాలని రహదారులు బస్సులు నిలిపేందుకు స్థలాలు లేక ఇబ్బందులు పడుతున్న ఆర్టీసీ యాజమాన్యం ఎన్ని రకాల చర్యలు తీసుకున్నప్పటికీ ఆర్టీసీకి మాత్రం ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి వస్తున్నది. ప్రస్తుతం హైదరాబాదులో జనాలకు తగ్గట్టుగా మెట్రో రైల్ సర్వీసులను ఏర్పాటు చేసినప్పటికీ మాత్రం అందులో జనాభా సంఖ్య తగ్గడం లేదనటానికి ఎన్నో నిదర్శనాలు ఉన్నాయి?. ఆర్టీసీ విషయంలో అధికారులు తీసుకుంటున్న నిర్ణయాలు, ప్రభుత్వం చేపడుతున్న ప్రణాళికలు, ఎప్పటికప్పుడు మార్పులు చేస్తున్న రహదారుల రద్దీ మాత్రం ఏ మాత్రం తగ్గటం లేదు. హనుమకొండ, తొర్రూరు, ఇతర జిల్లా బస్సులు భువనగిరి మార్గం నుండి వెళ్లే బస్సుల రద్దీ తట్టుకునేందుకు అలాగే ప్రభుత్వం చేపడుతున్న వంతెన నిర్మాణం దృష్టిలో ఉంచుకొని రానున్న కొద్ది రోజులలో పీర్జాదిగూడ ప్రాంతంలో గల నల్ల చెరువు వద్ద బస్టాండ్ నిర్మాణం ఏర్పాటు చేస్తున్నారు?. హనుమకొండ నుండి వెళ్లే బస్సులు ఎంజీబీఎస్ వరకు వెళ్లే అవకాశాలు ఉన్నాయని విశ్వసనీయ సమాచారం. జగద్గిరిగుట్ట ఇతర దూర ప్రాంతాలకు వెళ్లే బస్సులను నేరుగా పంపిస్తారని తెలుస్తున్నది. మామూలుగా హైదరాబాద్ వెళ్లే జిల్లా ఆర్టీసీ బస్సులను నల్లచెరువు ప్రాంతంలోని ఏర్పాటుచేసిన బస్టాండ్ వద్ద నిలిపివేస్తారు?. ఇక్కడ నుండి లోకల్ ఆర్టీసీ బస్సులు అన్ని ప్రాంతాలకు బయలుదేరి వెళ్ళనున్నాయని ప్రస్తుతం నిర్మాణ దశలో ఈ బస్ స్టేషన్ ఉన్నది. రోజు రోజుకి హైదరాబాదులో పెరుగుతున్న ట్రాఫిక్ ను ఎన్ని ఫ్లై ఓవర్లు ,అండర్ పాసులను ఏర్పాటుచేసిన మెట్రోలాంటి వాటిని ఏర్పాటు చేసిన ట్రాఫిక్ ఇబ్బందులు మాత్రం తొలగటం లేదు. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రంలో ఇతర రాష్ట్రాల నుండి హైదరాబాదుకు వచ్చేవారు ఎంతోమంది ఉన్నారు. ఎంజీబీఎస్, జేబీఎస్ బస్ స్టేషన్లు సరిపోవడం లేదు. ఈ పరిస్థితిని తట్టుకునేందుకు కే టీ జి ఎస్ ఆర్ టి సి 100 ఎకరాలలో బస్సు టర్మినల్ ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు విశ్వసనీయ సమాచారం. జీడిమెట్ల ,గాజులరామారం అంతర్రాష్ట్ర బస్సు సర్వీసులకు సిటీ బస్ సర్వీసులకు ,ఎలక్ట్రికల్ బస్సుల కోసం మరో చార్జింగ్ పాయింట్ లను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు ప్రభుత్వం రెడీ చేస్తున్నట్లు తెలుస్తోంది?. ఇతర రాష్ట్రాల నుండి వచ్చే బస్సు సర్వీసులకు ఇబ్బంది తలెత్తకుండా ఈ టెర్మినాలను ఏర్పాటు చేస్తున్నారు. గాజులరామారంలో 100 ఎకరాలలో ప్రత్యేకతను ఇతర రాష్ట్ర బస్సులకు సిటీ బస్సులకు పెరుగుతున్న రద్దీని దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వంఏర్పాటు చేస్తున్నట్లు ప్రతిపాదనలను సిద్ధం చేస్తున్నారు?. బస్సుల రద్దీ తట్టుకునేందుకు వంద ఎకరాల భూమినిమేడ్చల్, మల్కాజిగిరి జిల్లా అధికారులు ఈ మధ్యనే ఆర్టీసీ కి అందజేసినట్టు తెలుస్తుంది?. . ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్న బస్సు టర్మినల్ వద్దనే రానున్న రోజుల్లో బస్సులను ఆపే అవకాశాలు ఉన్నాయని, ఇప్పటికే సిటీ లోకి రాకుండా కూకట్పల్లి ,కెపిహెచ్ పి, లింగంపల్లి, పటాన్ చెరువు, ప్రాంతాలలో నిలిపివేస్తున్నారు. మెదక్ నుండి వచ్చే బస్సులు రోడ్లపై ఆపడంతో ట్రాఫిక్ సమస్యలు ఎదుర్కొంటున్నాయి. జగద్గిరిగుట్టలో ప్రతిరోజు రాత్రిపూట 60 బస్సుల వరకు నైట్ హార్ట్ చేస్తున్న డ్రైవర్ కండక్టర్లు బస చేసేందుకు సరైన స్థలం లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రధానమంత్రి ఈ డ్రైవ్ పథకం కింద టి జి ఎస్ ఆర్ టి సి కి కేంద్ర ప్రభుత్వం 2000 ఎలక్ట్రికల్ బస్సులను ఏర్పాటు చేసింది. భవిష్యత్తులో హైదరాబాదులో పూర్తిస్థాయిలో ఎలక్ట్రికల్ బస్సులు అందుబాటులోకి రానున్నాయి . మరో రెండు సంవత్సరాల్లో ఈ ఎలక్ట్రికల్ బస్సులు రానున్నట్లు తెలుస్తుంది? ఇవి కాకుండా హైదరాబాదులో మరో 10 కొత్త ఆర్టీసీ బస్సు డిపోలను ఏర్పాటు చేయాలని ఆర్టీసీ సంస్థ నిర్ణయం తీసుకుంటున్నట్లు విశ్వసనీయం సమాచారం?. దీనితో పది ఎకరాలలో ఎలక్ట్రికల్ బస్సులను ఏర్పాటు చేయనున్నారు?. ఇటు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం యొక్క ఆర్టీసీ సంస్థ కొత్త ప్రతిపాదనలతో హైదరాబాదులో ట్రాఫిక్ లో ఇబ్బందులు తలెత్తకుండా చేస్తున్న ప్రణాళికలు హర్షించదగ్గట్లుగాఉన్నాయని పరిశీలకులు భావిస్తున్న ట్లు పేర్కొన్నారు. సిటీ బస్సులు కూడా నిలిపేందుకు స్థలాలు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని దీనితోపాటు ఇతర రాష్ట్రాల బస్సులు సిటీలోనికి రావడానికి వారికి కూడా అనేక కష్టాలు ఎదుర్కొంటున్నారని ఏ నేపథ్యంలోనే రాష్ట్ర ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యం అనేక రకాల ప్రతిపాదనలు చేస్తున్నట్లు ట్రాఫిక్ సమస్యల నుండి ప్రయాణికుల ఇబ్బంది కలగకుండా అనేక మార్గాలను అన్వేషిస్తున్నారు. రానున్న రోజుల్లో ఎలాంటి మార్పులు జరగనున్నాయెూ వేచి చూడాల్సిందే. ఆర్టీసీ సమాచారాన్ని సేకరించిన పి సి డబ్ల్యూ న్యూస్ జర్నలిస్ట్ మనోహర స్వామి.




## ఇంటర్ ఫలితలలో మైనార్టీ కరీంనగర్ బాలురు 3 విద్యార్థుల ప్రభంజనం..



**కరీంనగర్ టౌన్ ఏప్రిల్ 13(పిసిడబ్ల్యూ న్యూస్):** నిన్న విడుదలైన ఇంటర్ ఫలితలలో మొగ్దుంపూర్ లోని మైనారిటీ గురుకుల కళాశాల కరీంనగర్ బాలురు 3 విద్యార్థులు అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి రాష్ట్ర స్థాయిలో మంచి ర్యాంకులు సాధించి తమ సత్తా చాటారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం 100% ఉత్తీర్ణత, ఇంటర్ మొదటి సంవత్సరంలో 95% ఉత్తీర్ణత సాధించారు. కళాశాల విద్యార్థులు ఎమ్మెల్టీ విభాగంలో ఎం.డి షాదబుద్దీన్ 487/500, ఎండి రహేమాన్987/1000, ఈటి విభాగంలో షేక్ ఇర్ఫాన్ పాషా 493/500, ఏ. అక్షిత్ రెడ్డి 986/1000 రాష్ట్ర స్థాయి ర్యాంకు లను సాధించారు.. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ పోరాండ్ల చంద్రమోహన్ హర్షం వ్యక్తం చేస్తూ కరీంనగర్ బాలురు 3 కళాశాల గత నాలుగు సంవత్సరాలుగా ఇంటర్ ఫలితలలో 100కీ 100% సాధిస్తూ అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తుందని తెలియజేస్తూ ఈ విజయానికి కృషి చేసిన విద్యార్థులకు , ఉపాధ్యాయ బృందానికి మరియు కళాశాలకు సహకరించిన తల్లిదండ్రులకు అభినందనలు తెలియజేసారు.

## గంగాధర మండలంలో పిహెచ్‌సి ఆధ్వర్యంలో టీకాలు



**గంగాధర ఏప్రిల్ 13 (పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలోని పీహెచ్ సి గంగాధరలో టీజీ ఎంఎస్ పాఠశాలకు చెందిన 40 మంది విద్యార్థిను లకు హెచ్ పి వి టీకాలు విజయవంతంగా ఇవ్వబడినవి. ఈ కార్యక్రమం గౌరవ అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఆదేశాల మేరకు నిర్వహించబడింది. కార్యక్రమంలో డాక్టర్ స్వేత, డాక్టర్ సౌమ్య, ప్రధానోపాధ్యాయురాలు ఎ. పద్మ మరియు మండల విద్యాధికారి శ్రీ ప్రభాకర్ రావు పాల్గొన్నారు. విద్యార్థినుల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకొని, భవిష్యత్తులో తీవ్రమైన వ్యాధులను నివారించేందుకు ఈ టీకా కార్యక్రమం నిర్వహించబడింది. హెచ్ పి వి టీకా ప్రయోజనాలు:సర్వైకల్ క్యాన్సర్ (గర్భాశయ ముఖ కేన్సర్) నివారణకు సహాయ పడుతుంది. హెచ్ పి వి వైరస్ వల్ల కలిగే ఇతర వ్యాధుల నుంచి రక్షణ కల్పిస్తుంది. భవిష్యత్తులో ఆరోగ్య సమస్యలను తగ్గిస్తుంది. యువతిలో దీర్ఘకాలిక ఆరోగ్య భద్రతను కల్పిస్తుంది. కాబట్టి గంగాధర మండలంలోని అన్ని హై స్కూల్ కేజీబీవీ మరియు గురుకుల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు గౌరవ అదనపు కలెక్టర్ ఆదేశాల ప్రకారం తమ విద్యార్థినులకు సెలవులకు వెళ్లే ముందు తప్పనిసరిగా హెచ్ పి వి టీకాలు వేయించవలసిందిగా విజ్ఞప్తి చేయబడుతుంది.

# పేద మహిళల ఆర్థిక సాధికారత ప్రభుత్వం లక్ష్యం: మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**- మహిళల ఆదాయం పెరిగితేనే కుటుంబ సంక్షేమం సాధ్యం**

**- ఇందిరమ్మ ఇళ్లు, సన్నబియ్యం ద్వారా పేదలకు భరోసా**

**- అంగన్వాడీ సేవలు నిబద్ధతతో నిర్వహించాలి.. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సిద్ధం**

**- గురుకుల విద్యతో పేదరికానికి చెక్ ప్రతి పిల్లవాడికి నాణ్యమైన భవిష్యత్**

**- క్యాంపు కార్యాలయంలో 500 కుట్టుమిషన్లు, టీఎన్జీవో ఫంక్షన్ హాల్‌లో అంగన్వాడీ టీచర్లకు సెల్‌ఫోన్ల పంపిణీ**





**ఖమ్మం ప్రతినిధి, ఏప్రిల్ 13 (పిసిడబ్ల్యూ న్యూస్) :** పేద మహిళల ఆర్థిక స్వావలంబన కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. సోమవారం ఖమ్మంలోని తన క్యాంపు కార్యాలయంలో 500 మంది మైనార్టీ మహిళలకు కుట్టు మిషన్లను పంపిణీ చేయడంతో పాటు, టీఎన్జీవో ఫంక్షన్ హాల్‌లో అంగన్వాడీ టీచర్లకు సెల్‌ఫోన్లను మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ... మహిళల సాధికారత కుటుంబ సంక్షేమానికి అత్యంత అవసరమని అన్నారు. పేదరికం నుండి బయటకు తీసుకురావాలంటే మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆదాయం సంపాదించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు ప్రతి సంవత్సరం 20 వేల కోట్ల నుంచి 23 వేల కోట్ల వరకు వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామని తెలిపారు. మహిళల కోసం ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యంపై ప్రభుత్వం 10 వేల కోట్ల వ్యయం చేస్తోందని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ఖమ్మం నగరంలో ఇప్పటికే 2500 ఇళ్లు మంజూరు చేయగా, రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 22 వేల కోట్ల వ్యయంతో కార్యక్రమం అమలు జరుగుతోందని, వచ్చే ఏడాది మరో 3500 మంది లబ్ధిదారులు ప్రయోజనం పొందనున్నారని తెలిపారు. పేద ప్రజలు కూడా నాణ్యమైన ఆహారం తీసుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం 14 వేల కోట్లతో సన్నబియ్యం పంపిణీ చేస్తోందని, గతంలో ఈ ప్రయోజనం మధ్యవర్తులకు మాత్రమే చేరేదని, ప్రస్తుతం నేరుగా ప్రజలకు అందిస్తున్నామని మంత్రి అన్నారు. రైతులు, యువత, కూలీలు ప్రతి వర్గం ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల ద్వారా లబ్ధి పొందుతున్నారని మంత్రి తెలిపారు. ముఖ్యంగా మైనారిటీ పిల్లలు తప్పనిసరిగా విద్యను అభ్యసించాలన్నారు. గురుకుల పాఠశాలల్లో 3 వేల మంది విద్యార్థులు చదువుకునే అవకాశం కల్పించగా, ఒక్క రూపాయి ఖర్చు చేయకుండా ఒక్కో విద్యార్థిపై ప్రభుత్వం సంవత్సరానికి సుమారు 1.5 లక్షలు వెచ్చిస్తోందని చెప్పారు. మన పిల్లలు విద్యను అభ్యసిస్తేనే పేదరికం నుండి బయటపడగలమని, నాణ్యమైన విద్య పొందిన పిల్లలు భవిష్యత్తులో ప్రపంచ వ్యాప్తంగా ఉద్యోగాలు సాధించి కుటుంబానికి గౌరవం, ఆనందం తీసుకొస్తారని మంత్రి తెలిపారు. **అంగన్వాడీ టీచర్లకు సెల్ ఫోన్ పంపిణి వద్ద ప్రత్యేకంగా మాట్లాడిన మంత్రి** తాను గతంలో అంగన్వాడీ శాఖ మంత్రిగా పని చేసిన సమయంలో రెండు సార్లు వేతనాలను పెంచినట్లు గుర్తుచేశారు. అంగన్వాడీ టీచర్లు పేద ప్రజలకు సేవ చేసే గొప్ప అవకాశం పొందారని, దానిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చిన్న చిన్న అసౌకర్యాల పేరుతో ర్యాలీలు చేయకుండా నిబద్ధతతో పనిచేయాలని, వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు. అంగన్వాడీ టీచర్లకు అందజేసిన సెల్‌ఫోన్లు ప్రజలకు సేవలందించేందుకు సమర్థంగా ఉపయోగించుకోవాలని మంత్రి సూచించారు. సెల్‌ఫోన్ల ద్వారా అంగన్వాడీ సేవలపై పూర్తి స్థాయి పర్యవేక్షణ సాధ్యమవుతుందని చెప్పారు. జిల్లాలోని అన్ని అంగన్వాడీ కేంద్రాలకు కొత్త భవనాలు మంజూరు చేసినట్లు, వాటిని అన్ని సౌకర్యాలతో త్వరగా పూర్తి చేస్తామని మంత్రి తెలిపారు. అనంతరం టీఎన్జీవోస్ ఫంక్షన్ హాల్ వద్ద ఖమ్మం నగరపాలక సంస్థ చే కొనుగోలు చేసిన 3 రహదారి ఊడ్చే యంత్రాలను మంత్రి ప్రారంభించారు. నగర మేయర్ పునుకొల్లు నీరజ, ఖమ్మం నగరపాలక సంస్థ కమీషనర్ అభిషేక్ అగస్త్య, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహారా, కార్పొరేటర్లు, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి ముజాహిద్, జిల్లా సంక్షేమ అధికారిణి వేల్పుల విజేత, ఖమ్మం నగర పాలక సంస్థ సహాయ కమీషనర్ అనిల్ కుమార్, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, పాల్గొన్నారు.